గౌతమ్ న్యూస్ తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
GTV GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సి ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.


# గౌతమ్ న్యూస్

తెలుగు దిన పత్రిక


ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GTV GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 227, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, బుధవారం - 25 - సెప్టెంబర్ - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## నటుడు విజయ్ సంచలన నిర్ణయం..

## 27న సమావేశానికి వారికి నో ఎంట్రీ



23న జరగాల్సిన టీవీకే తొలి రాష్ట్ర సదస్సు 27కు వాయిదా

మద్యం తాగి వచ్చే సభ్యులను సమావేశానికి అనుమతించకూడదని నిర్ణయం

క్యాడర్‌కు మార్గదర్శకాలు పంపిన టీవీకే ప్రధాన కార్యదర్శి ఆనంద్

## హైడ్రా భయంతో

## కుంట అలుగు తెంపిన స్థానికులు

వర్షాలకు నీటితో నిండిన కుంట

నీళ్లు తమ ఇళ్లల్లోకి వస్తే హైడ్రా దృష్టి పడుతుందని టెన్షన్

కుంట అలుగు ధ్వంసంపై అధికారులకు సమాచారం అందించిన జనం




## ఆరేళ్ల పాపపై అత్యాచార యత్నం..

## ఆపై హత్య చేసిన స్కూల్ ప్రిన్సిపాల్




గుజరాత్ లోని దహోద్ జిల్లాలో దారుణం

ఇంటి నుంచి పాపను తన కారులో స్కూలుకు తీసుకెళ్లిన ప్రిన్సిపాల్

దారిలో లైంగికంగా వేధింపులకు పాల్పడడంతో పాప అరుపులు

## ఓటుకు నోటు కేసులో 16న విచారణకు రావాలి


## : సీఎం రేవంత్ రెడ్డికి నాంపల్లి కోర్టు ఆదేశాలు




హైదరాబాద్ : ఓటుకు నోటు కేసులో నాంపల్లి కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 16న జరిగే విచా రణకు సీఎం రేవంత్ రెడ్డి హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. మంగళ వారం జరిగిన మిగతా..2లో

# ఏపీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ..

## 20 కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం




2లో

- జనసేనకు 3, బీజేపీకి ఒక పోస్టు కేటాయింపు
- ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణ
- వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్
- శాప్ ఛైర్మన్‌గా రవి నాయుడు
- 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా లంకా దినకర్

అమరావతి: ఏపీలో పలు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవాళ మొత్తం 20 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించింది. అలాగే ఒక కార్పొరేషన్‌కు వైస్ ఛైర్మన్, వివిధ కార్పొరేషన్లకు సభ్యులను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో జనసేన నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరికి అవకాశం దక్కింది.

# రేవంత్ రెడ్డి అన్నకు ఒక న్యాయం..

# పేదలకు ఒక న్యాయమా..

## రైతు భరోసా లేదు.. ముఖ్యమంత్రికి కుర్చీకే భరోసా లేదు

- ఉప ఎన్నికలపై కేటీఆం మరోసారి సంచలన కామెంట్స్ ఇదిలా ఉండగా..
- రేవంత్ చేస్తున్న దిక్కుమాలిన రాజకీయం ప్రజలు చూస్తున్నారు
- రాష్ట్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై ఏ స్థాయిలో రచ్చ జరిగిందో చూశాం
- హైకోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేల పట్ల తీర్పునిచ్చిన సందర్భంలోనూ ఆయన ఉప ఎన్నికలు వస్తాయంటూ వ్యాఖ్యలు
- అధికారంలో లేనప్పటికీ పార్టీ మీద అభిమానంతో ఇంతమంది సమావేశానికి వచ్చారు

2లో

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ఎస్ నుంచి పలువురు ఎమ్మెల్యేలు ఆ పార్టీకి



# ఎందరో దేశాధినేతలు...

# మరెందరో సీఈవోలతో భేటీ...

## ప్రధాని మోదీ అమెరికా టూర్ విజయవంతం...




ఢిల్లీ: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల అమెరికా పర్యటన విజయవంతంగా ముగిసింది, మోదీ యూఎస్ పర్యటనలో క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొనడం, యుఎన్ జనరల్ అసెంబ్లీలో 'సమ్మిట్ ఫర్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో ప్రసంగించడంతోపాటు అనేక మంది మిగతా..2లో

అమెరికా పర్యటనలో చివరి రోజు బిజీబిజీగా గడిపారు ప్రధాని మోదీ.. అమెరికా టెక్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.ప్రధాని మోదీ తన అద్భుతమైన పర్యటన ముగించుకుని న్యూఢిల్లీకి తిరిగి వస్తున్నారని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికా పర్యటనలో ప్రధాని మోదీ ఎజెండా అనేక ముఖ్యమైన కార్యక్రమాలతో నిండిపోయింది.




## రేవంత్ రెడ్డి మోసాన్ని బయటపెట్టినందుకు కాంగ్రెస్ సీనియర్లు అభినందించారు

2లో

- తెలంగాణ బీజేపీ నేతలు మాత్రం మౌనంగా ఉన్నారని ప్రశ్న
- రేవంత్ రెడ్డి, బీజేపీ నేతల మధ్య అద్భుతమైన ప్రేమకథ నడుస్తోందని చురక
- అమృత్ టెండర్లలో ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందన్న కేటీఆర్

హైదరాబాద్ : అమృత్ టెండర్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోసాన్ని బయట పెట్టినందుకు కొందరు సీనియర్ కాంగ్రెస్ నేతలు తనను అభినందించారని మిగతా..2లో

## నమ్మకం లేకుంటే జగన్ తిరుమలకు ఎందుకు వెళ్లినట్లు?



అప్పట్లో తిరుమల సందర్శించినపుడు డిక్లరేషన్ ఇవ్వని విషయం గుర్తుచేసిన సీఎం

సంప్రదాయాలపై నమ్మకం ఉంటే డిక్లరేషన్ ఇవ్వాల్సిందని వ్యాఖ్య

శ్రీవారి భక్తుల మనోభావాలను కించపరిచారంటూ మండిపాటు

అమరావతి : హిందూ సంప్రదాయాలపై నమ్మకంలేనపుడు సీఎం హోదాలో జగన్ తిరుమలకు ఎందుకు వెళ్లినట్లు అంటూ మిగతా..2లో

# ప్రజలు అధికారం ఇస్తే..

# సంప్రదాయాలు బ్రేక్ చేస్తారా..?

## సంప్రదాయాన్ని గౌరవించకపోతే తిరుమలకు ఎందుకు వెళ్లాలి

తిరుమల పవిత్రతను దెబ్బతీశారని, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని సీరియస్


దేశంలోనే కాకుండా ఇదర దేశాల్లో ఉన్న భక్తులంతా ఒకింత ఆవేదనకు గురయ్యారు

బ్రహ్మోత్సవాల సందర్భంగా కూడా సీఎం హోదాలో జగన్ పట్టువస్త్రాలు సమర్పించిన సమయంలోనూ ఆయన డిక్లరేషన్ ఇవ్వలేదు

జగన్ ఇప్పటికీ తిరుమల శ్రీవారిని దర్శించుకోవచ్చని, కానీ ఆయనకు వేంకటేశ్వర స్వామిపై నమ్మకం ఉన్నదా లేదా అనేది కూడా ముఖ్యం

అలాగే.. రథం కాలిపోతే తేనెటీగలు వచ్చి రథాన్ని కాల్చేశాయని ప్రజలను తప్పుదోవ పట్టించారని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం హయాంలో ఇలా చాలా ఘటనలపై నిర్లక్ష్యంగా వ్యవహరించి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని పేర్కొన్నారు. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా జగన్ సైలెంటుగా ఉండిపోయారని, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని పేర్కొన్నారు.

అమరావతి : తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వినియోగించారని వెలుగుచూసిన ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనమైంది. దేశంలోనే కాకుండా ఇదర దేశాల్లో ఉన్న మిగతా..2లో




## విద్యాశాఖకు మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్





- డీఎస్సీ ఫలితాల విడుదలపై జాప్యం
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్స్ వేదికగా ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత
- జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు జరిగిన డీఎస్సీ పరీక్షలు
- టీచర్ల అవసరం ఉందంటూ ప్రభుత్వం హడావుడిగా పరీక్షలు నిర్వహించిందన్న ఆర్ఎస్పీ

హైదరాబాద్ : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డీఎస్సీ ఫలితాల విడుదలపై చేస్తున్న జాప్యం విషయమై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రశ్నించారు. మిగతా..2లో

## వైవీ సుబ్బారెడ్డి విచారణకు హాజరు కావాల్సిందే: పవన్ కల్యాణ్

- తిరుమల లడ్డూ అపవిత్రం అయిందంటే చాలా ఆవేదన కలుగుతోందన్న పవన్
- భూమన తిరుమలలో హైడ్రామా చేశారని విమర్శ
- పొన్నవోలు మదమెక్కి మాట్లాడారని మండిపాటు




2

## విద్యాశాఖకు మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

మొదటి పేజీ తరువాయి

అసలు ఈ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వర్యులు ఎవరు...? ఆయన ఏ ప్రపంచంలో సేదతీరుతున్నారు..? విద్యాశాఖ మంత్రి లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే ఫైర్ అయ్యారు. ఉపాధ్యాయుల అవసరం ఉందంటూ హడావుడిగా పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం.. ఇప్పుడు ఫలితాలు ఎందుకు విడుదల చేయడం లేదని నిలదీశారు. తెలంగాణ ప్రభుత్వం ఆగమేఘాల మీద డీఎస్సీ పరీక్షలు జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్ (సీబీటీ) లో నిర్వహించిందని, చాలా మంది అభ్యర్థులు వాయిదా వేయాలని వేడుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. తొందరగా టీచర్ల అవసరముందని ప్రభుత్వం హడావుడిగా పరీక్షలు నిర్వహించిందని ఆరోపించారు. అంతా ఆన్‌లైన్ పరీక్ష అయినప్పుడు దీనికి సంబంధించిన నియామక భర్తీ ప్రక్రియ ఎందుకు నత్త నడకన సాగుతోంది అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. అభ్యర్థులకు ఫలితాలు తొందరగా ఇచ్చి, జనరల్ ర్యాంకింగ్స్ ప్రకటించి, నియామక పత్రాలు అందజేస్తే వారు త్వరగా బడులకు వెళ్లి పిల్లలకు పాఠాలు బోధిస్తారని ఆయన తెలిపారు. వారం రోజుల్లో డీఎస్సీ ఫలితాలు విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారని, అలాగే సెప్టెంబర్ 5వ తేదీ వరకు నియామకాలు చేపడుతామని కూడా హామీ ఇచ్చారని... కానీ అమలుకు నోచుకోవడం లేదని ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాలోని సొమ్మును కొడంగల్, ఢిల్లీకి తరలించినట్లు అనిపిస్తుందని పేర్కొన్నారు. అందుకే జీతాలకు డబ్బుల్లేక, గురుకుల టీచర్లకే ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. ఇక డీఎస్సీ టీచర్లకు ఎక్కడ్నుంచి తీసుకొచ్చి ఇవ్వాలనే ధోరణిలో ప్రభుత్వం ఉందన్నారు. హైడ్రా పేరుతో అందరి దృష్టి మళ్లించి, వచ్చే ఏడాది నియామక పత్రాలు ఇవ్వాలని కాంగ్రెస్ సర్కార్ కుట్ర చేస్తున్నట్లు అనిపిస్తుందని ఆయన తెలిపారు.

## వైవీ సుబ్బారెడ్డి విచారణకు హాజరు కావాల్సిందే: పవన్ కల్యాణ్

అమరావతి: సనాతన ధర్మం జోలికి రావద్దంటూ వైసీపీ నేతలను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో అపవిత్రం జరిగిందంటే చాలా ఆవేదన కలుగుతోందని చెప్పారు. వైసీపీ నేతలు బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి నిన్న తిరుమలలో హైడ్రామా చేశారని దుయ్యబట్టారు. విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గగుడిలో ఆలయ మెట్లను ఈరోజు పవన్ శుభ్రం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ నేతలపై మండిపడ్డారు. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో గతంలో టీటీడీ ఛైర్మన్ గా పని చేసిన వైవీ సుబ్బారెడ్డి విచారణ ఎదుర్కోవాల్సిందేనని పవన్ చెప్పారు. గతంలో టీటీడీ ఈవోగా పని చేసిన ధర్మారెడ్డి ఎక్కడున్నారో కూడా తెలియడం లేదని విమర్శించారు. లడ్డూ అంశంపై వైసీపీ నేత పొన్నవోలు సుధాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. పొన్నవోలు మదమెక్కి మాట్లాడారని... ప్రస్తుత పరిస్థితుల్లో పొగరుగా మాట్లాడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తప్పు జరిగితే ఒప్పుకోవాలని... లేకపోతే సంబంధం లేదని చెప్పాలని అన్నారు. ధర్మాన్ని కాపాడే బాధ్యత మీమీద లేదా? అని ప్రశ్నించారు. సినీ నటుడు ప్రకాశ్ రాజ్ తన గురించి మాట్లాడారని... ఏం జరిగిందో తెలుసుకుని ఆయన మాట్లాడాలని పవన్ అన్నారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని, ఏ మతాన్ని విమర్శించనని చెప్పారు. సనాతన ధర్మంపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తప్పు జరిగితే మాట్లాడొద్దా? అని ప్రశ్నించారు. సెక్యులరిజం అంటే టూ వే అని... వన్ వే కాదని చెప్పారు. ఇష్టం వచ్చినట్టు మాట్లాడొద్దని ప్రకాశ్ రాజ్ ను హెచ్చరించారు.

## నటుడు విజయ్ సంచలన నిర్ణయం.. 27న సమావేశానికి వారికి నో ఎంట్రీ

ఢిల్లీ: తమిళగ వెట్రి కళగం (టీవీకే) పేరుతో రాజకీయ పార్టీ స్థాపించిన తమిళ అగ్రనటుడు విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఈ నెల 27న పార్టీ పార్టీ తొలి రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు మద్యం తాగి వచ్చే సభ్యులను అనుమతించ కూడదని నిర్ణయించారు. అంతేకాదు, సమావేశానికి వచ్చే వారికి ఉండాల్సిన కొన్ని నిబంధనలు కూడా విధించారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, పుదుచ్చేరి మాజీ ఎమ్మెల్యే ఎన్. ఆనంద్ మార్గదర్శకాలు జారీచేశారు. సదస్సుకు హాజరయ్యే సభ్యులు మద్యం తాగివస్తే వారిని దూరంగా ఉంచుతామని ఆ మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. సదస్సుకు హాజరయ్యే మహిళా సభ్యులు, సానుభూతిపరుకు అవసరమైన రక్షణ కల్పించాలని కార్యకర్తలకు ఆనంద్ సూచించారు. అలాగే, కాన్ఫరెన్స్‌కు హాజరయ్యేందుకు వచ్చేవారు రోడ్డుపై ఇతర వాహనాలకు అంతరాయం కలగకుండా చూసుకోవాలని, బైక్‌పై వచ్చేవారు స్టంట్స్ చేయవద్దని కోరారు. సమావేశం సమయంలో విధులు నిర్వర్తించే వైద్య బృందం, ఫైర్, రెస్క్యూ సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కాగా, ఈ నెల 23నే కాన్ఫరెన్స్ నిర్వహించాల్సి ఉండగా వివిధ కారణాలతో దానిని వాయిదా వేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ పోటీ చేస్తుందని విజయ్ ఇప్పటికే ప్రకటించారు.

## హైడ్రా భయంతో కుంట అలుగు తెంపిన స్థానికులు

హైదరాబాద్ : హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను గుర్తించి హైడ్రా కూల్చివేతలు చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ కూల్చివేతల భయంతో మంచిరేవులలో కొంతమంది స్థానికులు వర్షాలకు నీటితో నిండిన కుంట అలుగును తెంపేశారు. కుంట పూర్తిగా నిండడం, మళ్లీ వర్షం పడితే వరద తమ ఇళ్లల్లోకి వస్తుందనే ఆలోచనతో ఈ పని చేశారు. వరద నీరు వచ్చి చేరితే హైడ్రా దృష్టి ఎక్కడ తమ ఇళ్లపై పడుతుందోననే భయంతో పొక్లెయిన్ తెప్పించి మరీ అలుగు తెంపారు.

### అసలేం జరిగిందంటే..

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంచిరేవుల వీరభద్రస్వామి గుట్టకు వెళ్లేదారిలో ఎకరం 29 గుంటల విస్తీర్ణంలో ఉన్న మల్లన్న కుంట నిండింది. దీంతో తమ ఇళ్ల వద్దకు నీరు చేరే అవకాశం ఉందని, వరద ముంచెత్తితే హైడ్రా ఎక్కడ తమ ఇళ్లపైకి వస్తుందోనని కొంతమంది స్థానికులు ఆందోళన చెందారు. ఆ ప్రమాదం లేకుండా సోమవారం పొక్లెయిన్ తీసుకువచ్చి అలుగును కొంత తొలగించి నీటిని బయటికి వదిలారు. ఈ చర్యలను మరికొంతమంది అడ్డుకుని అధికారులకు సమాచారం అందించారు. దీనిపై తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి స్పందించి వీఆర్ఏలను అక్కడికి పంపించారు. వీఆర్ఏలు బి.మల్లేష్, అచ్యుత్‌లు అలుగును పరిశీలించి స్థానికులను విచారించారు. అనంతరం విషయాన్ని నీటిపారుదల శాఖ అధికారులకు తెలియజేశారు. కుంట అలుగు ధ్వంసం చేసిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## ఆరేళ్ల పాపపై అత్యాచార యత్నం.. ఆపై హత్య చేసిన స్కూల్ ప్రిన్సిపాల్

ఢిల్లీ: ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల పాపపై ఆ స్కూలు ప్రిన్సిపాల్ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.. తన వికృత చేష్టలను అడ్డుకుందనే కోపంతో గొంతుపిసికి చంపేశాడు. ఆపై మృతదేహాన్ని స్కూలు ఆవరణలో పడేసి ఏమీ తెలియనట్టు నటించాడు. పోలీసుల విచారణలో నిజం బయటపడడంతో కటకటాల పాలయ్యాడు. గుజరాత్ లోని దహోద్ జిల్లాలో జరిగిందీ దారుణం. పోలీసుల వివరాల ప్రకారం.. దహోద్ జిల్లాలోని ఓ స్కూలు ప్రిన్సిపాల్ ఓ చిన్నారిని రోజూ తన కారులో స్కూలుకు తీసుకెళ్లేవాడు. పాప తల్లిదండ్రులతో పరిచయం ఉండడం, అదే స్కూలులో పాప చదువుతుండడంతో నమ్మి పంపించేవాళ్లు. రోజూలాగే గురువారం కూడా పాపను రెడీ చేసి ప్రిన్సిపాల్ తో పంపించింది. అయితే, సాయంత్రం స్కూలు టైమ్ అయిపోయినా పాప ఇంటికి చేరలేదు. ఏం జరిగిందోనని ఆందోళన పడుతూ స్కూలుకు వెళ్లిన పాప తల్లిదండ్రులకు పాప మృతదేహం కనిపించింది. స్కూలు ఆవరణలో అప్పటికే పాప మృతదేహాన్ని గుర్తించిన టీచర్లు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. స్కూలు టీచర్లను, పాప క్లాస్ మేట్లను విచారించారు. ఆ రోజు అసలు పాప స్కూలుకే రాలేదని వారు చెప్పారు. పాప తల్లి మాత్రం రోజూ లాగే పాపను ప్రిన్సిపాల్ తో పంపించానని చెప్పింది. ప్రిన్సిపాల్ ను ప్రశ్నించగా.. పాపను స్కూలు దగ్గర దింపేసి వేరే పనిమీద వెళ్లిపోయానని చెప్పాడు. అయితే, ప్రిన్సిపాల్ తీరు అనుమానాస్పదంగా కనిపించడం, పాపను చివరిసారిగా చూసింది అతడొక్కడే కావడంతో పోలీసులు అనుమానించి గట్టిగా విచారించారు. దీంతో పాపను తానే హత్య చేసినట్లు ప్రిన్సిపాల్ ఒప్పుకున్నాడు. కారులో స్కూలుకు వస్తుండగా మధ్యలో లైంగికంగా వేధించానని, తన చేష్టలకు పాప అరవడంతో గొంతు పిసికి చంపేశానని చెప్పాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రిన్సిపాల్ ను అరెస్టు చేశారు.


## ఓటుకు నోటు కేసులో 16న విచారణకు రావాలి : సీఎం రేవంత్ రెడ్డికి నాంపల్లి కోర్టు ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి

విచారణకు మత్తయ్య హాజరవ్వగా..కేసులోని ఇతర నిందితులు గైర్హాజరయ్యారు. ఈడీ కేసు విచారణలో నిందితులు హాజరు కాకపోవడంపై నాంపల్లి ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. తదుపరి విచారణకు తప్పకుండా హాజరుకావాల్సిందేనని స్పష్టం చేసింది. వచ్చేనెల 16వ తేదీకి విచారణను వాయిదా వేసింది. ఆ రోజు సీఎం రేవంత్ సహా నిందితులు అందరూ కోర్టుకు హాజరు కావాలని స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసును తెలంగాణ నుంచి మధ్యప్రదేశ్ భోపాల్ కోర్టుకు బదిలీ చేయాలంటూ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి పిటీషన్ ను ఇటీవలే సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసు విచారణ కొనసాగిస్తున్న నాంపల్లి కోర్టు తదుపరి విచారణకు హాజరుకావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆదేశించడం సంచలనంగా మారింది. 2015లో తెలంగాణలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్ సన్ ను టీడీపీ పార్టీకి మద్దతుగా వ్యవహరించమని డబ్బు ఆశచూపిన ఆరోపణలపై అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. స్టీఫెన్ సన్ ఇంట్లో రేవంత్ రెడ్డి డబ్బు సంచులతో ఉన్నట్లు ఉన్న వీడియోలు అప్పట్లో సంచలనంగా మారాయి. దీంతో కేసు నమోదు చేసిన ఏసీబీ దీనిపై సుధీర్ఘంగా విచారణ జరుపుతోంది. ఇందులో భాగంగానే నాంపల్లి కోర్టు సీఎం రేవంత్ రెడ్డితో పాటు నిందితులుగా ఉన్న సెబాస్టియన్, ఉదయ్ సింహా, మత్తయ్య జెరూసలేం, సండ్ర వెంకట వీరయ్య, వేం కృష్ణ కీర్తన్‌కు సమన్లు జారీ చేసింది.?

# ప్రజలు అధికారం ఇస్తే.. సంప్రదాయాలు బ్రేక్ చేస్తారా..?

మొదటి పేజీ తరువాయి



భక్తులంతా ఒకింత ఆవేదనకు గురయ్యారు. ఇందుకు గత వైసీపీ ప్రభుత్వమే కారణమంటూ ప్రభుత్వం పెద్దలు ఆరోపిస్తుండగా.. వైసీపీ కూడా దానిపై ఎదురుదాడికి దిగింది. అప్పటి నుంచి వైసీపీ నేతలు, కూటమి నేతల మధ్య మాటలు కొనసాగుతూనే ఉన్నాయి. మరోవైపు.. రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్ష కూడా తీసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ పెద్ద ఎత్తున మద్దతుగా నిలిచారు. ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటికే జగన్‌పై ఈ అంశంపై చంద్రబాబు నాయుడు చాలా సీరియస్‌గా ఉన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీశారని, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని సీరియస్ అయ్యారు. తాజాగా ఆయన చేసిన వైసీపీ అధినేత జగన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అయింది. జగన్ ముందు ఆయన పెద్ద డిమాండ్ పెట్టారు. వేంకటేశ్వర స్వామి అంటే నమ్మకం ఉంటే.. అన్యమతస్తుల సంప్రదాయం ప్రకారం తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వాలని, కానీ సీఎం హోదాలో జగన్ మిస్ యూజ్ చేశారని పేర్కొన్నారు. జగన్ డిక్లరేషన్ ఇవ్వకుండానే తిరుమలకు వెళ్లారని తెలిపారు. సంప్రదాయాన్ని గౌరవించకపోతే తిరుమలకు ఎందుకు వెళ్లాలి అని నిలదీశారు. ప్రజలు అధికారం కట్టబెట్టినందుకు ఇలా సంప్రదాయాలను బ్రేక్ చేయడమా అని ప్రశ్నించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా కూడా సీఎం హోదాలో జగన్ పట్టువస్త్రాలు సమర్పించిన సమయంలోనూ ఆయన డిక్లరేషన్ ఇవ్వలేదని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన పలు ఘటనలూ ఆయన ప్రస్తావించారు. తిరుమలలో లడ్డూ పోటులో అగ్ని ప్రమాదం జరిగితే.. ఇప్పుడు ఏమైందంటూ వైసీపీ నేతలు అన్నారని తెలిపారు. అలాగే.. రథం కాలిపోతే తేనెటీగలు వచ్చి రథాన్ని కాల్చేశాయని ప్రజలను తప్పుదోవ పట్టించారని అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వం హయాంలో ఇలా చాలా ఘటనలపై నిర్లక్ష్యంగా వ్యవహరించి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని పేర్కొన్నారు. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా జగన్ సైలెంటుగా ఉండిపోయారని, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని పేర్కొన్నారు. జగన్ ఇప్పటికీ తిరుమల శ్రీవారిని దర్శించుకోవచ్చని, కానీ ఆయనకు వేంకటేశ్వర స్వామిపై నమ్మకం ఉన్నదా లేదా అనేది కూడా ముఖ్యమని పేర్కొన్నారు. ఇటు తిరుమల లడ్డూ ఉదంతంపై తెలుగు రాష్ట్రాల్లో ఇంకా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలయాన్ని శుద్ధి చేశారు. మరోవైపు.. లడ్డూ ప్రసాదం కల్తీని నిరసిస్తూ ఏపీ, తెలంగాణ సాధు పరిషత్ ఆధ్వర్యంలో స్వామిజీలు తిరుమలలో ఆందోళను దిగారు. తితిదే పరిపాలన భవనం ఎదుట నిరసనకు దిగారు. 'సేవ్ తిరుమల.. సేవ్ తితిదే' అంటూ నినాదాలు చేశారు. ఆలయాల్లో అన్యమతస్తులను ఉద్యోగులుగా నియమించవద్దని డిమాండ్ చేశారు. గత పాలకమండలి ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, అప్పటి ఈవోలు జవహర్ రెడ్డి, ధర్మారెడ్డి తదితరులపై చర్యలు తీసుకోవాలని ఈ ధర్నా చేపట్టారు.

# రేవంత్ రెడ్డి అన్నకు ఒక న్యాయం.. పేదలకు ఒక న్యాయమా..

మొదటి పేజీ తరువాయి



దూరంగా ఉంటూ వస్తున్నారు. బీఆర్ఎస్ బీ ఫామ్ పై గెలిచిన వీరు.. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటున్నారనేది టాక్. కొందరు అధికారికంగా చేరినప్పటికీ ఇంకా దానిపై ఎలాంటి క్లారిటీ లేదు. దాంతో ఇటీవల రాష్ట్రంలో ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై ఏ స్థాయిలో రచ్చ జరిగిందో చూశాం. అందు లోనూ.. ఇద్దరు ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కౌశిక్ రెడ్డి మధ్య వారం రోజుల పాటు యుద్ధమే కొనసాగింది. మరోవైపు.. నలుగురు ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంపై ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. స్పందించిన హైకోర్టు అసెంబ్లీ స్పీకర్‌కు పలు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా.. శేరిలిం గంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి పీఏసీ ఛైర్మన్ పదవి ఇవ్వడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి భగ్గుమన్నారు. బీఆర్ఎస్ బీ ఫామ్ పై గెలిచి ఛైర్మన్ పదవి తీసుకోవడంపై ఫైర్ అయ్యారు. వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలా ఒకరిపై ఒకరు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. చివరకు కేసుల వరకూ ఈ ఘటన వెళ్లింది. అయితే.. ఫిరాయింపు అంశాన్ని ముందు నుంచి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుపడుతున్నారు. అందులో భాగంగా నలుగురి ఎమ్మెల్యేల విషయంలో ఆయన మరింత సీరియస్‌గా ఉండడంతో ఆయా చోట్ల ఉప ఎన్నికలు తప్పవంటూ చెప్పుకొస్తున్నారు. కౌశిక్ రెడ్డి వివాదం జరిగిన నేపథ్యంలోనూ.. హైకోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేల పట్ల తీర్పునిచ్చిన సందర్భంలోనూ ఆయన ఉప ఎన్నికలు వస్తాయంటూ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు తాజాగా మరోసారి ఆయన ఉప ఎన్నికల ప్రస్తావనాన్ని తీసుకొచ్చారు. నాలుగు నియోకజవర్గాల అంశాన్ని కాకుండా ఈసారి శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆయన టార్గెట్ చేశారు. ఆ నియోజకవర్గానికి తప్పకుండా ఉప ఎన్నిక తప్పదని చెప్పారు. ఈ రోజు ఆయన శేరిలింగంపల్లి బీఆర్ఎస్ నేతలతో సమావేశం కాగా.. వారితో ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారంలో లేనప్పటికీ పార్టీ మీద అభిమానంతో ఇంతమంది సమావేశానికి వచ్చారని, గాంధీకి బీఆర్ఎస్ పార్టీ ఏం తక్కువ చేసిందని ఆయన పార్టీ మారిండని ప్రశ్నించారు. రేవంత్ చేస్తున్న దిక్కుమాలిన రాజకీయం ప్రజలు చూస్తున్నారని, ఎక్కువ కాలం ఇది నడవదని జోస్యం చెప్పారు. రైతు భరోసా లేదు.. ముఖ్యమంత్రికి కుర్చీకే భరోసా లేదని ఫైర్ అయ్యారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్ వచ్చి డ్రామాలు ఆడారని, కానీ నిరుద్యోగులకు మాత్రం ఈ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. దమ్ముంటే ముందు పట్నం మహేందర్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల నిర్మాణాలు కూల్చాలని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి అన్నకు ఒక న్యాయం.. పేదలకు ఒక న్యాయమా అని నిలదీశారు. కేటీఆర్ మరోసారి ఉపఎన్నికల ప్రస్తావన తీసుకురావడంతో ఇప్పుడు జకవర్గ ప్రాష్ట్రవ్యాప్తంగా అందులోనూ శేరిలింగంపల్లి నియోరజల్లో చర్చకు దారితీసింది. ఒకవేళ ఉపఎన్నిక వస్తుందా..? వస్తే మళ్లీ ఎవరు బరిలో నిలుస్తారు..? అంటూ అప్పుడే చర్చలు మొదలయ్యాయి. కేటీఆర్ వ్యాఖ్యలతో అటు బీఆర్ఎస్ నేతల్లోనూ అదో ఉత్సాహం కనిపించింది. మరోసారి బీఆర్ఎస్ పార్టీనే గెలిపించుకుంటామని ఆ సమావేశంలో వారు ముక్తకంఠంతో చెప్పినట్లుగా సమాచారం.

# ఎందరో దేశాధినేతలు.. మరెందరో సీఈవోలతో భేటీ..

మొదటి పేజీ తరువాయి

ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వ హించారు. అమెరికా పర్యటనలో చివరి రోజు బిజీబిజీగా గడిపారు ప్రధాని మోదీ.. అమెరికా టెక్ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.ప్రధాని మోదీ తన అద్భుతమైన పర్యటన ముగించుకుని న్యూఢిల్లీకి తిరిగి వస్తున్నారని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికా పర్యటనలో ప్రధాని మోదీ ఎజెండా అనేక ముఖ్యమైన కార్యక్రమాలతో నిండిపోయింది. మొదటి రోజు, ఆస్ట్రేలియన్ ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాన మంత్రి ఫుమియో కిషిడాతో జో బిడెన్ స్వస్థలమైన విల్మింగ్టన్, డెలావేర్‌లో సమావేశమయ్యారు. అక్కడ నలుగురు నాయకులు క్వాడ్ సమ్మిట్‌కు హాజం ˘య్యారు. సమావేశం సందర్భంగా, జనరల్ అటామిక్స్ తయారు చేస్తున్న 31 యంక్యూ-9బి సాయుధ డ్రోన్‌ల కొనుగోలుపై బిడెన్, మోదీ మధ్య కీలక ఒప్పందం కుదిరింది. అంతేకాకుండా, రక్షణ హార్డ్‌వేర్ సరఫరాను పెంచడం గురించి కూడా ఇరువురు నేతలు చర్చలు జరిపారు. కాగా, అమెరికాకు స్మగ్లింగ్ చేసిన 297 పురాతన వస్తువులను బిడెన్ ప్రధాని మోదీకి తిరిగి ఇచ్చారు. క్వాడ్ సమ్మిట్ సందర్భంగా ఆస్ట్రేలియా, జపాన్ నాయకు లతో మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. పరస్పర ప్రయోజనం కోసం సహకారాన్ని మరింతగా పెంచు కోవాలని నిర్ణయించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును ప్రోత్సహించే లక్ష్యంతో చర్చలు జరిగాయి. క్వాడ్ సమ్మిట్‌లో, సహకారం, అనుసంధానం ద్వారా అభివృద్ధికి భారతదేశం నిబద్ధతను మోదీ నొక్కిచెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో క్యాన్సర్‌తో పోరాడటానికి క్వాడ్ క్యాన్సర్ మూన్‌షాట్ చొరవను కూడా సమ్మిట్ ప్రకటించింది. గర్భాశయ క్యాన్సర్‌తో పోరాడటానికి భారతదేశం 7.5 మిలియన్ డాలర్లను సాయం చేసకోవాలని క్వాడ్ దేశాలు నిర్ణయించాయి. మోదీ పర్యటన రెండో రోజుగా న్యూయార్క్‌కు తీసుకెళ్లారు. అక్కడ భారీ సంఖ్యలో హాజరైన భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్ఆర్ఐ కొలీజియంలో 13 వేల మందికి పైగా అమెరికన్-భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. భారతదేశ భవిష్యత్తు గురించి ప్రధాని మోదీ తన దృష్టిని ప్రదర్శించారు. ఇదిలా ఉండగా, తన అమెరికా పర్యటనలో రెండో రోజున, బోస్టన్, లాస్ ఏంజెల్స్‌లో కొత్త కాన్సులేట్‌లను ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

భారతదేశం-అమెరికా సంబంధాలను బలోపేతం చేయడంలో భారతీయ-అమెరికన్ కమ్యూనిటీ వారి పాత్రను ప్రధాని మోదీ ప్రశంసించారు. వారిని భారతదేశ బ్రాండ్ అంబాసిడర్‌లుగా పిలుస్తున్నారు. న్యూయార్క్‌లో, మోదీ పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌ను కూడా కలుసుకున్నారు. గాజాలో మానవతా సంక్షోభంపై ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి కోసం భారతదేశం మద్దతును పునరుద్ఘాటించారు. భారతదేశం వృద్ధి అవకాశాలను, వివిధ రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంభావ్య ప్రయోజనాలను ప్రస్తావిస్తూ.. అగ్రశ్రేణి యుఎస్ టెక్ కంపెనీల సిఈవో లతో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రధాని మోదీ అమెరికా పర్యటన చివరి రోజు తయారీ, ఆవిష్కరణకు భారత్‌ను గమ్యస్థానంగా చూడాలని అమెరికన్ టెక్ కంపెనీలకు మోదీ విజ్ఞప్తి చేశారు. భారత్‌తో కలిసి అభివృద్ధి, డిజైన్, ఉత్పత్తి చేయాలని సూచించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాని మోదీ ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ దిగ్గజాలతో సమావేశమయ్యారు. అసెంచర్, అడోబ్, గూగుల్, ఐబియం సహా 15 ప్రఖ్యాత కంపెనీల సిఈవో లు, ఛైర్మన్లు ఇందులో పాల్గొన్నారు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అడోబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శంతను నారాయణ్, ఎన్విడియా సీఈవో జెన్‌సెన్ హాంగ్ సహ 15 కంపెనీల సీఈవోలు ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు.

పలు టెక్ కంపెనీల సీఈవోలతో సక్సెస్‌ఫుల్‌గా చర్చలు జరిగాయని, టెక్నాలజీ, ఇన్నోవేషన్ తదితర అంశాల గురించి చర్చించామని మోదీ తెలిపారు. మేడ్ బై ఇండియా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు వెల్లడించారు. ప్రపంచంలో మేటి కార్పొరేట్ దిగ్గజాలతో కలిసి ఒకే వేదికపై కూర్చోవడం చాలా ఆనందంగా ఉందన్నారు మోదీ. భారత్‌లో సమర్థవంతమైన డిజిటల్ ఏకోసిస్టమ్ ఉంది. భారత్ స్టార్టప్ హబ్‌గా ఉంది.. ప్రపంచంలో యూత్ టాలెంట్ కూడా భారత్ లోనే ఎక్కువగా ఉంది. పదేళ్ల నా పాలన చూసి ప్రజలు మళ్లీ ఆశీర్వదించారు. పెట్టుబడులు పెట్టే వారిని భారత్‌లో మంచి అవకాశాలు ఉన్నాయి. అద్భుతమైన పాలసీలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉన్న అవకాశాలను తాము అన్వేషిస్తామని గూగుల్ %జజుూ% సుందర్ పిచాయ్ అన్నారు. న్యూయార్క్‌లో ప్రధాని మోదీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో టెక్ దిగ్గజాలతో కలిసి పిచాయ్ పాల్గొన్నారు. డిజిటల్ ఇండియా విజన్‌తో భారతదేశాన్ని మార్చేందుకు ప్రధాని మోదీ దృష్టి సారించారని తెలిపారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రసంగించారు మోదీ.. యుఎన్ సమ్మిట్ ఆఫ్ ఫ్యూచర్‌లో కీలక ఉపన్యాసం చేశారు.

## రేవంత్ రెడ్డి మోసాన్ని బయటపెట్టినందుకు కాంగ్రెస్ సీనియర్లు అభినందించారు

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కాంగ్రెస్ సీనియర్ల నుంచి తనకు అభినందనలు వస్తే, తెలంగాణ బీజేపీ నేతలు ఈ విషయంలో మౌనంగా ఉండటం తనకు ఆశ్చర్యం కలిగిస్తోందని పేర్కొన్నారు. తమకు ఏమి తెలియనట్లు, వినబడనట్లు బీజేపీ నేతల వ్యవహారం ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి, బీజేపీ నేతల మధ్య అద్భుతమైన ప్రేమకథ నడుస్తోందని చురక అంటించారు. అమృత్ టెండర్లలో రాష్ట్ర ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని కేటీఆర్ గత కొన్ని రోజులుగా ఆరోపిస్తున్నారు. నిజాలు నిగ్గు తేల్చాలంటూ కేంద్రమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, టోచన్ సాహుకు మూడు రోజుల క్రితం లేఖ కూడా రాశారు.

పెద్ద మనుషులను మోసం చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు కల్లిబొల్లి మాటలు చెప్పి పెద్దమనుషులను కూడా మోసం చేసిందని కేటీఆర్ మరో ట్వీట్‌లో విమర్శించారు. ఆసరా పెన్షన్లతో అవ్వ- తాతలకు కేసీఆర్ ప్రభుత్వం భరోసా నింపిందని, నాడు బీఆర్ఎస్ రెండు వేల రూపాయల పెన్షన్ ఇచ్చి కోడళ్ళు తమ అత్తలను ప్రేమగా చూసుకునేలా చేసిందని పేర్కొన్నారు. కేసీఆర్... బొడ్లో సంచి బరువు పెంచి అమ్మమ్మ-నాయనమ్మల గౌరవం పెంచారని పేర్కొన్నారు. రూ.4 వేలు ఇస్తానని అబద్ధపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ముసలవ్వలను రోడ్డు మీదకు తీసుకువచ్చాడని విమర్శించారు. మొన్న గద్వాల్ లో అవ్వా-తాతలు రోడ్ల మీద ధర్నా చేయగా, ఈరోజు వృద్ధ దంపతులు మానకొండూర్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చారని పేర్కొన్నారు. ఇందుకు సిగ్గనిపించడం లేదా రేవంత్ రెడ్డీ? అని నిలదీశారు. తక్షణం జూటా హామీని ఆపివేసి, అవ్వలకు 4 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఏపీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ.. 20 కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం

మొదటి పేజీ తరువాయి

ఇక ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణ, వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా అబ్దుల్ అజీజ్, శాప్ ఛైర్మన్‌గా రవి నాయుడిని, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్‌గా లంకా దినకర్‌ను ప్రభుత్వం నియమించింది. 99 మందితో మొదటి నామినేటెడ్ పదవుల జాబితాను ప్రకటించిన కూటమి ప్రభుత్వం బీసీ, ఎస్సీ, మైనార్టీ, ఎస్టీలకు పెద్ద పీట వేసింది. 11 మంది క్లస్టర్ ఇంఛార్జ్‌లకు పదవులు ఇచ్చింది. ఇందులో ఒక క్లస్టర్ ఇంఛార్జ్‌కు ఏకంగా ఛైర్మన్ పదవి దక్కడం గమనార్హం. అలాగే మరో ఆరుగురు యూనిట్ ఇంఛార్జ్‌లకు కూడా పదవులు దక్కాయి. ఇక తాజాగా ప్రకటించిన 99 పదవుల్లో యువతకు ప్రాధాన్యం దక్కింది. పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో కష్టపడిన సామాన్య కార్యకర్తలకు సీఎం చంద్రబాబు పదవులు కట్టబెట్టారు.

20 కార్పొరేషన్ల ఛైర్మన్లు వీరే..

ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ - కొనకళ్ల నారాయణ,వక్ఫ్ బోర్డు - అబ్దుల్ అజీజ్,శాప్ - రవి నాయుడు,హౌసింగ్ బోర్డు %-% బత్తుల తాతయ్య బాబు,20 సూత్రాల అమలు కమిటీ - లంకా దినకర్ (బీజేపీ),ఏపీ ట్రైకార్ - బొరగం శ్రీనివాసులు,ఏపీ మారిటైమ్ బోర్డు %-% దామచర్ల సత్య,ఎస్ఈఈడీఏపీ %-% దీపక్ రెడ్డి,విత్తనాభివృద్ధి సంస్థ - మన్నె సుబ్బారెడ్డి,ఏపీఐఐసీ - మంతెన రామరాజు,మార్క్ ఫెడ్ - కర్రోత్తు బంగార్రాజుఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ %-% నూకసాని బాలాజీ,,పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ - నందం అబద్దయ్య,ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ %-% పీలా గోవింద సత్యనారాయణ,లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ %-% పిల్లి మాణిక్యాలరావు,ఏపీ స్టేట్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ %-% పీతల సుజాత,,ఏపీ స్టేట్ సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ - తోట మెహర్ సీతారామ సుధీర్(జనసేన),ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ %-% తమ్మిరెడ్డి శివశంకర్(జనసేన)ఏపీ టీఐడీసీవో %-% వేములపాటి అజయ్ కుమార్ (జనసేన),ఏపీటీపీసీ %-% వజ్జ బాబురావు,ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ %-% పీఎస్ మునిరత్నం

# నమ్మకం లేకుంటే జగన్ తిరుమలకు ఎందుకు వెళ్లినట్లు?

మొదటి పేజీ తరువాయి


ఏపీ సీఎం చంద్రబాబు ట్విట్టర్ వేదికగా మండిపడ్డారు. గతంలో జగన్ తిరుమల పర్యటనను ప్రస్తావిస్తూ... హిందూయేతరులు శ్రీవారి దర్శనానికి వెళ్లినపుడు ముందుగా డిక్లరేషన్ ఇవ్వడం సంప్రదాయమని, అందరూ దానిని పాటిస్తారని గుర్తుచేశారు. అయితే, క్రిస్టియన్ అయిన జగన్ మాత్రం డిక్లరేషన్ ఇవ్వకుండానే శ్రీవారిని దర్శించుకున్నాడని మండిపడ్డారు. శ్రీవారి భక్తుల మనోభావాలను కించపరిచారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో దేవాలయాల్లో జరిగిన ఘటనల పట్ల జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. "వెంకటేశ్వర స్వామిపై నమ్మకం ఉన్న అన్యమతస్థులు కూడా తిరుమలకు వెళ్లొచ్చు. అయితే, ముందుగా శ్రీవారిపై నమ్మకం ఉందని డిక్లరేషన్ ఇవ్వాలి. అన్యమతస్థులు ఎవరైనా సరే దీనికి అతీతులు కారు. అయితే, జగన్ మాత్రం ఈ పద్ధతిని పాటించలేదు. ప్రజలు అధికారం ఇచ్చింది సంప్రదాయాలకు వ్యతిరేకంగా పనిచేయడానికి కాదు అనే విషయం జగన్ గుర్తించలేదు. సంప్రదాయాన్ని గౌరవించకపోతే తిరుమల ఎందుకు వెళ్లారని ప్రశ్నించినందుకు మమ్మల్ని బూతులు తిట్టారు. రథం కాలిపోతే.. తేనెటీగలు కారణమని అన్నారు. తిరుమల పోటులో అగ్ని ప్రమాదం జరిగితే ఏమవుతుందంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో భక్తుల మనోభావాలు దెబ్బతీశారు. అందుకే భగవంతుడికి అందరం క్షమాపణ చెప్పాలి. ఇక ఆయనే చూసుకుంటాడు. అపచారం చేసి ఆ అబద్ధాలను నిజాలుగా చేయాలని చూడటం స్వామి ద్రోహం" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

# శ్రీనగర్ లాల్‌చౌక్ కోసం మామ- మేనల్లుడు పోటీ



శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. 90 అసెంబ్లీ స్థానాల్లో శ్రీనగర్‌లోని లాల్ చౌక్ సీటు కీలకమైన సీటుగా పేరొందింది. సెప్టెంబర్ 25న లాల్ చౌక్ స్థానానికి రెండో దశలో పోలింగ్ జరగనుంది. ఈ సీటు నుంచి ఇతర అభ్యర్థులతో పాటు మామ, మేనల్లుడు కూడా తలపడుతున్నారు. లాల్ చౌక్ నుంచి అప్నీ పార్టీ సీనియర్ నేత అష్రఫ్ మీర్, పీడీపీ యువ అభ్యర్థి జుహైబ్ యూసుఫ్ మీర్ తలపడుతున్నారు. వీరిద్దరూ వరుసకు మామా- మేనల్లుడు. గతంలో అష్రఫ్ మీర్ పీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సోనావర్ స్థానం నుండి పోటీచేసి, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను ఓడించారు. అయితే 2018లో బీజేపీ, పీడీపీ కూటమి తెగిపోవడంతో అష్రఫ్ మీర్ పీడీపీని వీడి అల్తాఫ్ బుఖారీ సొంత పార్టీ అయిన అప్నీలో చేరారు. కాగా జుహైబ్ బ్రిటన్ నుంచి ఆర్థికశాస్త్రంలో పీజీ పట్టా పొందారు. మెహబూబా ముఫ్తీ అతనికి లాల్ చౌక్ నుండి పోటీ చేసేందుకు టిక్కెట్ ఇచ్చారు. దీంతో లాల్ చౌక్‌లో మామ- మేనల్లుడు పోరు ఆసక్తికరంగా మారింది. మరోవైపు జమ్మూ కశ్మీర్ చరిత్రలో ఏనాడూ ఒక్క సీటు కూడా గెలవని బీజేపీ ఈసారి లాల్ చౌక్ అసెంబ్లీ నియోజకవర్గంలో తన బలాన్ని చాటే ప్రయత్నం చేస్తోంది. బీజేపీ అభ్యర్థి అజాజ్ హుస్సేన్ ఇక్కడి నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధం అయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా శ్రీనగర్‌లో ర్యాలీ నిర్వహించి, ఇక్కడి ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత బీజేపీ ఇక్కడ పలు అభివృద్ధి పనులు చేసిందని మోదీ పేర్కొన్నారు.

# జగన్‌కు సీఎం చంద్రబాబు మాస్ వార్నింగ్!



**అమరావతి,:** తిరుమల లడ్డూ వివాదం వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ పై విమర్శల దాడికి దిగారు సీఎం చంద్రబాబు. వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి దేవుడిని దర్శించుకోవచ్చని అన్నారు. అయితే ఆయనకు వేంకటేశ్వర స్వామిపై నమ్మకం ఉందా లేదా అనేది ముఖ్యం అని... నమ్మకం ఉంటే అన్యమతస్థులు సాంప్రదాయం ప్రకారం డిక్లరేషన్ ఇవ్వాలని చెప్పారు. డిక్లరేషన్ ఇవ్వాల్సిన బాధ్యత నీకు లేదా? ఆ సాంప్రదాయాన్ని గౌరవించకపోతే నువ్వు తిరుమల ఎందుకు వెళ్లాలి? నీకు అధికారం ఇచ్చింది ముఖ్యమంత్రిగా కానీ సాంప్రదాయాలకు విరుద్ధంగా పని చేయమని కాదు. అది అడిగితే బూతులు తిట్టారు అని మండిపడ్డారు.

### మనోభావాలను దెబ్బ తీశారు...

ఆంజనేయస్వామికి చెయ్యి నరికేస్తే ఏమైంది బొమ్మే కదా? వైసీపీ వాళ్ళు అన్నారని గుర్తు చేశారు. హనుమంతుడు బొమ్మా? వెంకటేశ్వరస్వామి బొమ్మా?... రాములవారి తల తీసేస్తే ఏముంది ఇంకో విగ్రహం పెట్టుకోవచ్చు కదా? అన్నారని అన్నారు. రథం కాలిపోతే. ఏముందీ తేనెటీగలు వచ్చాయి అన్నారు. తిరుమల పోటులో అగ్ని ప్రమాదం జరిగితే ఏమౌతుంది అని అడిగారు. ఇలా నిర్లక్ష్యంగా ప్రవర్తించి భక్తుల మనోభావాలను దెబ్బ తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే బాధపడుతూ చెబుతున్నానని. మనం అందరం ఉండి కూడా భగవంతుడికి ఇలా అపరాధం జరిగిందేది మన బాధ అని అన్నారు. అందుకే భగవంతుడికి అందరం క్షమాపణ చెప్పాలని కోరారు. "ఇక భగవంతుడే చూసుకుంటాడు అది వేరే విషయం. ఏ మతమైనా సరే కానీ, వేరే వారిని చులకనగా చూడటం కరెక్టు కాదు. అపచారం చేసి ఆ అబద్ధాలను నిజాలుగా చేయాలని చూడటం స్వామి ద్రోహం." అని అన్నారు.


# ఏపీలో వరద బాధితులకు సర్కార్ గుడ్ న్యూస్

### -అకౌంట్లలో డబ్బులు ఎప్పుడంటే..



**అమరావతి,:** ఏపీలో భారీ ఎత్తున వచ్చిన వరదలకు విజయవాడతో పాటు గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ నష్టం జరిగింది. దీనిపై ఇప్పటికే నష్టం అంచనాలు సేకరించిన ప్రభుత్వం .. బాధితులకు అందించే సాయంపైనా ప్రకటన చేసింది. ఈ మేరకు వారికి పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. బాధితుల అకౌంట్లలోకి ఈ సాయాన్ని రేపు జమ చేయబోతున్నారు. ప్రతీ సచివాలయం పరిధిలోని గుర్తించిన వరద బాధితులకు ఈ సాయం అందనుంది. విజయవాడలోని 179 సచివాలయాల పరిధిలోని ప్రజలకు వరద బాధితులకు సాయం అందనుంది. వరదల్లో గ్రౌండ్ ఫ్లోర్ మునిగిన వారికి రూ.25 వేలు, మొదటి, ఆపై అంతస్తుల్లో ఉండే వారికి రూ.10 వేలు ఇవ్వనున్నారు. దుకాణాలు ధ్వంసమైన వారికి రూ.25 వేలు, పంటలకు హెక్టారుకు రూ.25 వేల చొప్పున అందజేస్తారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో నష్టపోయిన ఇళ్లకు రూ.10 వేలు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించింది. రాష్ట్రంలోని వరద ప్రాంతాల్లో బాధితులకు అందించే సాయంపై ఇప్పటికే ప్రభుత్వం అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. వీటి ఆధారంగా వరద సాయాన్ని బాధితుల అకౌంట్లలోకి జమ చేయనున్నారు. అయితే పలు చోట్ల కుటుంబాలు మ్యాపింగ్ కాకపోవడంతో వారికి సాయం అందించే విషయంలో ప్రభుత్వం క్లారిటీ ఇవ్వడం లేదు. దీంతో వారు విజయవాడలో రోడ్లపై నిరసనలకు దిగుతున్నారు. వీరికి ఎలా సాయం అందించాలనే విషయంలో ప్రభుత్వం త్వరలో ఆదేశాలు ఇవ్వనుంది.

# హైకోర్టులో సిద్ధరామయ్యకు ఎదురుదెబ్బ



బెంగళూరు : ముడా కేసులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు మంగళవారం హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ (ముడా)లో సిద్ధరామయ్య తన భార్యకు స్థలాలు కేటాయించడంలో అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపణలు వచ్చాయి. సిఎంపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ ఇచ్చిన ఆమోదాన్ని సిద్ధరామయ్య సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. సిద్ధరామయ్య వేసిన పిటిషన్‌ను మంగళవారం కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. జస్టిస్ ఎం నాగప్రసన్న నేతృత్వంలోని బెంచ్ ఈమేరకు మంగళవారం తీర్పును ఇచ్చింది. కాగా, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ కింద తనపై దర్యాప్తునకు అనుమతిస్తూ.. భారతీయ నాగరిక్ సురాఖా సంహిత 2023లోని సెక్షన్ 218 ప్రకారం ప్రాసిక్యూషన్‌ను అనుమతిస్తూ గవర్నర్ మంజూరు చేసిన అనుమతిని సిద్ధరామయ్య తన పిటిషన్‌లో ప్రశ్నించారు. ముడా కేసులో బెంగళూరుకు చెందిన ప్రదీప్ కుమార్ ఎస్‌పి, టిజె అబ్రహం, మైసూరుకు చెందిన స్నేహమయి కృష్ణ అనే సామాజిక కార్యకర్తలు దాఖలు చేసిన దరఖాస్తులపై ఆ రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాటల్ ఆ రాష్ట్ర సిఎం సిద్ధరామయ్యని విచారించేందుకు ఆగస్టు 17న అనుమతిని మంజూరు చేశారు. గవర్నర్ అనుమతుల జోక్యాన్ని సవాల్ చేస్తూ సిద్ధరామయ్య పిటిషన్ దాఖలు చేశారు.

# ఇజ్రాయెల్ భీకర దాడులు

### లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై గురి
### 356 మంది మృతి
### 1,024 మందికి గాయాలు
### 300కు పైగా లక్ష్యాలపై విరుచుకుపడిన ఐడీఎఫ్
### ప్రతిగా డజన్ల కొద్దీ రాకెట్లు ప్రయోగించామన్న హెజ్బొల్లా



జెరుసలేం: ఇజ్రాయెల్ ఆర్మీ, హెజ్బొల్లా మిలిటెంట్ల మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ఇవి మరింత ముదిరి తీవ్ర యుద్ధానికి దారి తీసే ప్రమాదముందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఉదయం లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ ఆర్మీ) భీకర దాడులకు తెరతీసింది. ఈ దాడుల్లో 21 మంది చిన్నారులు, 39 మంది మహిళలు సహా 356మంది చనిపోగా, 1,024 మంది గాయపడ్డారని లెబనాన్ తెలిపింది. సరిహద్దులకు 130 కిలోమీటర్ల దూరంలోని బిబ్లోస్ ప్రావిన్స్ అటవీ ప్రాంతంతోపాటు, బాల్బెక్, హెర్మెల్‌లపైనా బాంబు దాడులు జరిగినట్లు లెబనాన్ వెల్లడించింది. తాము లెబనాన్‌లోని 300కు పైగా లక్ష్యాలపై దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. ఈ దాడుల గురించి దక్షిణ లెబనాన్ వాసులను ఆర్మీ ముందుగానే హెచ్చరించింది. హెజ్బొల్లా స్థావరాలు, ఆయుధ డిపోలు, ఇతర మౌలిక వసతులకు, భవనాలకు సమీపంలో ఉండే పౌరులు తక్షణమే ఖాళీ చేయాల్సిందిగా కోరింది. ఇజ్రాయెల్ నగరాలు, పౌరులపైకి గురిపెట్టిన వందల సంఖ్యలో క్షిపణులు, రాకెట్లను ధ్వంసం చేసినట్లు అనంతరం ప్రధాని నెతన్యాహు వెల్లడించారు. వచ్చే రోజుల్లో పరిస్థితులు మరింత క్లిష్టతరం కానున్నాయంటూ ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం. ఉత్తర ప్రాంతంలో సమీకరణాల్ని మార్చాలన్నదే తమ ప్రయత్నమని, ఇందుకు తగ్గ ఫలితం కన్పిస్తోందని అన్నారు. ఈ సమయంలో కలిసికట్టుగా ఉండి అధికారుల సూచనలు, హెచ్చరికలను పాటించాలని నెతన్యాహు ప్రజలను కోరారు. అనంతరం హెజ్బొల్లా హైఫా, గలిలీ ప్రాంతాల్లోని ఇజ్రాయెల్ ఆర్మీ వసతులపైకి డజన్లకొద్దీ రాకెట్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. హెజ్బొల్లా సంస్థ ఆయుధాల డిపోలకు సమీపంలో ఉండే వారు వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని ఆయన కోరారు. గతేడాది అక్టోబర్ నుంచి హెజ్బొల్లా, ఇజ్రాయెల్ ఆర్మీ మధ్య జరుగుతున్న పోరులో కనీసం 600 మంది చనిపోయారు. మృతుల్లో ఎక్కువ మంది మిలిటెంట్లే. వీరిలో 100 మంది వరకు పౌరులుంటారని అంచనా. శుక్రవారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో హెజ్బొల్లా టాప్ కమాండర్లు సహా 45 మంది చనిపోవడం తెలిసిందే. మంగళ, బుధవారాల్లో వాకీటాకీలు, పేజర్లు, రేడియోలు పేలిన ఘటనల్లో 37 మంది చనిపోగా మరో 3 వేల మంది గాయపడ్డారు. ప్రతీకారంగా ఆదివారం హెజ్బొల్లా సరిహద్దులకు సుదూరంగా ఉన్న హైఫాలోని రఫేల్ డిఫెన్స్ సంస్థతోపాటు వివిధ లక్ష్యాలపైకి 150 వరకు రాకెట్లను ప్రయోగించడం తెలిసిందే.

### వెళ్లిపోవాలంటూ మెసేజ్‌లు

తామున్న ప్రాంతాలను విడిచి వెళ్లాంటూ 80 వేల మందికి పైగా సెల్‌ఫోన్లలో మెసేజీలు అందాయని లెబనాన్ అధికారులు తెలిపారు. ఇలాంటి వాటిని పట్టించుకోవద్దని కోరారు. భయాందోళనలను, అయోమయాన్ని సృష్టించడం ద్వారా మానసికంగా దెబ్బతీసేందుకు శత్రువు పన్నిన పన్నాగమని ప్రజలకు తెలిపారు. అయితే, తీవ్ర దాడుల నేపథ్యంలో ప్రజలు పెద్ద సంఖ్యలో మూటాముల్లె సర్దుకుని అందుబాటులో ఉన్న వాహనాల్లో బీరుట్ దిశగా బయలుదేరారు. దీంతో, తీరప్రాంత సిడొన్ నగరంలో ట్రాఫిక్ స్తంభించింది. 2006లో ఇజ్రాయెల్- హెజ్బొల్లా మధ్య యుద్ధంగా జరిగాక ఇంత భారీగా జనం వలసబాట పట్టడం ఇదే మొదటిసారని పరిశీలకులు అంటున్నారు. ఈ పరిస్థితుల్లో కళాశాలలు, పాఠశాలలను తెరిచి ఉంచాల్సిందిగా లెబనాన్ హోం శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇళ్లు వదిలేసి భారీగా వలస వస్తున్న ప్రజలకు పాఠశాల భవనాల్లో ఆశ్రయం కల్పించాలని కోరింది.

### దాడులు మరింత తీవ్రం

రాకెట్ లాంఛర్లు తదితరాలతో సరిహద్దులకు దగ్గర్లోని దక్షిణ ప్రాంతాన్ని మిలటరీ స్థావరాలుగా హెజ్బొల్లా మార్చేసిందని ఇజ్రాయెల్ ఆరోపించింది. అందుకే భారీగా బాంబు దాడులు చేయక తప్పడం లేదంది. హెజ్బొల్లాను నిలువరించేందుకు వైమానిక దాడులపై తమ దృష్టంతా ఉందని పేర్కొంది. దక్షిణ లెబనాన్‌లోని 17 గ్రామాలు, పట్టణాల మ్యాప్‌ను విడుదల చేసింది. ఆపరేషన్లను మరింత విస్తరించనున్నట్లు ప్రకటించింది. రానున్న రోజుల్లో బెకా లోయతోపాటు మరిన్ని ప్రాంతాల్లో తీవ్ర దాడులుంటాయని ఇజ్రాయెల్ మిలటరీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హలెవి ప్రకటించారు.

# సంక్షోభ లంకపై నెలవంక!



దాదాపు రెండున్నరేళ్లక్రితం విదేశీ రుణాల చెల్లింపులు అసాధ్యమై దివాలా తీసింది మొదలు వరస సంక్షోభాలను చవిచూస్తున్న శ్రీలంకలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. నూతన అధ్యక్షుడిగా సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించిన అనూర కుమార దిస్సనాయకే వర్తమాన సంక్షోభ పరంపర నుంచి దేశాన్ని గట్టెక్కిస్తారన్న ఆశలు జనంలో దండిగానే ఉన్నాయి. కనుకనే వారసులవైపే మొగ్గే అలవాటున్న ప్రజానీకం ఈసారి మార్క్సిస్టు అయిన దిస్సనాయకేను ఎంపిక చేసుకున్నారు. 2022లో నిత్యావసరాల కొరత, అధిక ధరలు, పన్నుల మోతతో పాటు దేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతిపై ఆగ్రహోదగ్రులైన ప్రజలు అధ్యక్ష భవనంపై, పార్లమెంటుపై దాడిచేయటం, నాటి అధ్యక్షుడు గొటబయ రాజపక్స, ఆయన పరివారం దేశం విడిచి పరారుకావటం ప్రపంచాన్ని దిగ్భ్రమపరి చాయి. అధ్యక్ష, పార్లమెంటు ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన మూడేళ్లలోపే రాజపక్సకు ఈ దుర్గతి పట్టింది. అందుకే దిస్సనాయకే అత్యంత జాగరూకతతో పాలన సాగించి దేశాన్ని ఒడ్డున పడేయాల్సి వుంటుంది. గతంలో ఎంపీగా, మంత్రిగా పనిచేసి ఉండొచ్చుగానీ సంక్షోభంలో కొట్టు మిట్టాడుతున్న దేశానికి సారథ్యం స్వీకరించటం సామాన్యం కాదు. రనిల్ విక్రమసింఘే ప్రభుత్వం పెను ఆర్థిక విపత్తు నుంచి గట్టెక్కడానికి ఐఎంఎఫ్‌ను ఆశ్రయించినప్పుడు 290 కోట్ల డాలర్ల రుణం మంజూరుచేస్తూ కఠినమైన షరతులు పెట్టింది. పర్యవసానంగా పొదుపు చర్యల పేరుతో జీతాలు, పెన్షన్లు కోత పడ్డాయి. సంక్షేమ పథకాలు అటకెక్కాయి. ప్రజలు అర్ధాకలితో వెళ్లదీస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వామపక్ష జనతా విముక్తి పెరమున (జేవీపీ) నాయకుడిగా భావసారూప్య పార్టీలతో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) పేరిట కూటమి ఏర్పరిచి ఘనవిజయం సాధించటం దిస్సనాయకే ఘనత. గత ఎన్నికల్లో కేవలం నాలుగు శాతం ఓట్లతో, పార్లమెంటులో మూడంటే మూడే స్థానాలు గెల్చుకున్న పార్టీ ఈ స్థాయిలో దూసుకురావటం అసాధారణం. కోతలను సరళం చేస్తామన్న ఎన్‌పీపీ హామీ వోటర్లను విశేషంగా ఆకట్టుకుంది. దానికి తోడు సంప్రదాయపక్షాలు, అవి ఇచ్చే అబద్ధపు హామీలతో జనం విసిగిపోయారు. అందుకే కావొచ్చు... ఈ విజయం ఏ ఒక్కరిదో కాదని దిస్సనాయకే అన్నారు. 2022 నాటి 'అరగల్య' (పోరాటం) ఉద్యమంలో జనం సమీకృతులు కావటం వెనక వారిలో గూడుకట్టుకున్న అసంతృప్తితో పాటు జేవీపీ తెర వెనక కృషి కూడా ఉంది. జనాగ్రహాన్ని నిర్మాణాత్మకంగా మలచటంలో, అరాచకం ప్రబలకుండా చూడటంలో ఆ పార్టీ విజయం సాధించింది. అందుకే ఇటీవల బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న పరిణామాల వంటివి అక్కడ జరగలేదు. బంగ్లాలో ఇస్లామిక్ తీవ్రవాదుల ఆధిపత్యం పెరగటం, బురఖా ధరించని మహిళలను బహిరంగ ప్రదేశాల్లో కొట్టి హింసించటం పరిపాటైంది. అంతేగాదు... దేశావిర్భావానికి మూల కారణమైన భాష, ప్రాంతం వంటి అస్తిత్వ అంశాలు సైతం బుట్టదాఖలా అవుతున్నాయి. ఆ పరిస్థితి లంకలో తలెత్తకపోవటం, సంక్షోభంలో సైతం రనిల్ ప్రభుత్వం సజావుగా సాగటంలో జేవీపీ పాత్ర కాదనలేనిది. అయితే జేవీపీ చరిత్రలో నెత్తుటి అధ్యాయాలు తక్కువేం కాదు. దాదాపు అరవైయ్యేళ్ల క్రితం ఆవిర్భవించి 70, 80 దశకాల్లో దేశంలో హింసాకాండను ప్రేరేపించిన జేవీపీని తుడిచిపెట్టడానికి ప్రభుత్వాలు చేయని ప్రయత్నమంటూ లేదు. మార్క్సిజాన్ని అనుసరిస్తున్నామని మావో, హోచి మిన్, చేగువేరా తమకు ఆదర్శమంటూనే సింహళ జాతీయవాదాన్ని రెచ్చగొట్టి వేలాదిమంది లంక తమిళులను ఊచకోత కోయటం, వారికి అనుకూలంగా మాట్లాడే వందలాదిమందిని హత మార్చటం జేవీపీ చరిత్రలో మాయని మచ్చ. తమ వైఖరిని వ్యతిరేకించే పాత్రికేయులను సైతం ఆ పార్టీ కాల్చి చంపింది. ప్రేమదాస హయాంలో ఉత్తర తూర్పు ప్రాంతంలో తమిళ టైగర్లనూ, ఉత్తరాన జేవీపీ మిలిటెంట్లనూ ఆయన ప్రభుత్వం అణిచేసింది. పొలిట్ బ్యూరోలో ఒక సభ్యుడు మినహా జేవీపీ నాయకత్వం మొత్తాన్ని అంతం చేసింది. అయితే కనుమరుగైందనుకున్న జేవీపీ క్రమేపీ మళ్లీ బలం పుంజుకున్నా ఎప్పటిలాగే దాన్ని అంతర్గత సంక్షోభాలు చుట్టుముట్టాయి. చివరకు పార్లమెంటరీ పంథాకు మెజారిటీ వర్గం మొగ్గుచూపి భారత-శ్రీలంక సైనిక ఒప్పందాన్ని వ్యతిరేకించిన చంద్రికా కుమారతుంగకు మద్దతునిచ్చింది. ఆమె ప్రభుత్వంలో భాగస్వామి అయింది. చుట్టూతా ఒక్కో దేశమే చైనా ప్రభావంలో పడి భారత వ్యతిరేక రాగం అందుకుంటున్న వర్త మానంలో దిస్సనాయకే గెలుపు మన ప్రభుత్వానికి ఒక రకంగా సమస్యాత్మకమే. మైనారిటీలుగా ఉన్న లంక తమిళులకు స్వయంపాలన ఇచ్చే 13వ రాజ్యాంగ సవరణను అమలు చేయాలని మన దేశం చాన్నాళ్లుగా కోరుతోంది. కానీ రాజపక్స దాన్ని బేఖాతరు చేశారు. దిస్సనాయకే వైఖరి సైతం అదే. అదానీల 450 మెగావాట్ల పవన విద్యుత్ కాంట్రాక్టును రద్దు చేస్తామని ఎన్నికల సభల్లో ఆయన చెప్పాడు. దానికితోడు భావజాలం రీత్యా చైనాకు సన్నిహితుడు. ఆ దేశం ఇచ్చిన అప్పులే దేశాన్ని సంక్షోభంలోకి నెట్టాయని దిస్సనాయకేకు తెలియంది కాదు. 2022 సంక్షోభం అనంతరం మన దేశం లంకకు 400 కోట్ల డాలర్ల అత్యవసర రుణం మంజూరు చేయటంతోపాటు ఐఎంఎఫ్ రుణం రావటంలో కీలకపాత్ర పోషించింది. పదునైన దౌత్యం పరమ శత్రువులను సైతం గెల్చుకోగలదు. మొదట్లో తీవ్ర స్థాయి భారత వ్యతిరేక వైఖరి తీసుకున్న మాల్దీవుల అధ్యక్షుడు మహమద్ మియిజూ ఇందుకు ఉదాహరణ. అందువల్ల అసాధ్యం కానిదేదీ లేదు. ఇంతవరకూ దిస్సనాయకే ఎత్తుగడలు గమనిస్తే ఆయన సవ్యంగా అడుగులు వేస్తారని అంచనా వేయొచ్చు.

# ధర్మరక్షణ బోర్డు ప్రతిపాదన ఒక సవాలు!



సనాతన ధర్మ రక్షణకై జాతీయ స్థాయిలో ఒక బోర్డ్ ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ సూచించడం ఆశ్చర్యకరమైన, ఎంతో ఆహ్వానించదగిన విషయం. సాధారణంగా రాజకీయ నాయకులు మతాలకు అతీతంగా ఉన్నట్టు వ్యవహరిస్తుంటారు. అయినా పవన్ కళ్యాణ్ ప్రజానాయకుడిలా ఆలోచించి మాట్లాడారు. ఈ ప్రతిపాదన ద్వారా ఆయన నిద్రపోతున్న హిందూ సమాజానికి, హిందూ మత పెద్దలకు, ప్రభుత్వాలకు అందరికీ ఒక సవాలు విసిరారు అందుకు ఆయన అభినందనీయులు. సనాతన ధర్మానికి చెందినవారు సుమారు 80శాతం వరకు ఉన్నారు, అల్పసంఖ్యాకులకైతే రక్షణ కావాలి గాని మెజారిటీ వర్గానికి రక్షణ ఏమిటి అని ఒక ప్రశ్న రావచ్చు. అయితే దేశ స్వాతంత్ర్యం తరువాత రాజకీయ ధోరణుల్ని పరిశీలిస్తే అన్నింటికన్నా ఎక్కువ హాని సనాతన ధర్మానికి జరిగిందని చూడగలం. ప్రపంచంలో వందకు పైగా దేశాలు క్రిస్టియన్ దేశాలని, యాభైకి పైగా ఇస్లామిక్ దేశాలని చెప్పుకుంటున్నాయి కానీ 80 శాతం హిందువులు ఉన్న ఈ దేశాన్ని హిందూ దేశమని చెప్పలేం. హిందూ మతాన్ని నిర్మూలించడానికి, దేశాన్ని విడగొట్టడానికి ఎన్ని బయట శక్తులు ప్రయత్నిస్తున్నాయో ఈ వ్యాసంలో చెప్పదలచుకోలేదు. ఒక హిందూ మతాన్ని నిర్మూలించగలిగితే మిగతా మతాలన్నీ వాటంతటవే బలహీనమై కనుమరుగవుతాయి. ఒక హిందూ మతం నశిస్తే భారత్‌లో కూడా ఆఫ్రికా దేశాల్లో లాగా రెండు అబ్రహామిక్ మతాల మధ్య పోరాటాలు, అంతర్యుద్ధాలతో దేశం విడిపోతుంది. అలా చేయాలనే విదేశీ మేధావుల ప్రణాళికలు. అందువల్ల కేవలం హిందూ మతం పైనే విదేశీ శక్తుల ప్రయత్నాలన్నీ. ప్రపంచంలో ఒకే ఒక హిందూ దేశంగా గుర్తించబడిన నేపాల్‌ను వామపక్ష మేధావులు మావోయిస్టుల చేతిలో పెట్టారు. మనదేశంలోని మార్క్సిస్టులు కూడా నేపాల్ మార్క్సిస్టులతో సహకరించి మావోయిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ముఖ్యపాత్ర వహించారు. భారత్‌కు నేపాల్‌కు ఉన్న సాంస్కృతిక సంబంధాలను తెగగొట్టడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. నేపాల్‌ను చైనాకు బానిసదేశంగా మార్చిన ఈ మేధావులే భారతదేశాన్ని కూడా అలా చేయాలని దీర్ఘకాలిక వ్యూహాలతో ఉన్నారు. మత ప్రాతిపదికపై ఏర్పడిన ఓటు బ్యాంకులు రాజకీయ వర్గాలను ప్రభావితం చేస్తాయి. దీనితో రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకులను సంతృప్తిపరిచే పథకాలను అమలు చేస్తారు. మెజారిటీ వర్గాన్ని ఏ విధంగా కులాల పేరిట చీలగొట్టారన్నది అందరికీ తెలిసిందే. హిందూ సమాజానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడానికి ఏ వర్గము ముందుకు రాలేదు. భారతీయ మతాల గురించి మాట్లాడే ఆరెస్సెస్- విశ్వహిందూ పరిషత్ లాంటి సంస్థలకు మత ఛాందసవాదులు అనే ముద్ర వేసి వాటిని నోరెత్తకుండా చేస్తున్నాం. కానీ అదే సమయంలో ఇతర మతాల సంస్థలకు పెద్దపీట వేసి మన ఉదార స్వభావాన్ని చాటుకుంటున్నాం. సెక్యులరిజం ఇదే అంటున్నాం. ఇతర మతాల రక్షణకై ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన సంస్థలను చూస్తే ఇది స్పష్టం అవుతుంది. దేవాలయాల ఆస్తుల్ని రక్షించుకోవడానికి ఉన్న ఎండోమెంట్ లాంటి వ్యవస్థలు నామమాత్రంగానే ఉన్నాయి. వాటిలో పనిచేసేవారు ప్రభుత్వ కీలుబొమ్మలే, అధికార పార్టీల కీలుబొమ్మలే. ఇతర మతాల పుస్తకాల్ని మనం చదవకపోవడం, మన పుస్తకాల గురించి ఎదుటివాడు చెప్పిన దాన్ని నమ్మడం మన లక్షణం. సొంత బుద్ధితో అన్ని మతాల గూర్చి చదివితే సనాతన ధర్మాన్ని ఎందుకు రక్షించుకోవాలో మనకే తెలుస్తుంది. ఈ విషయంపై ఎంతో చెప్పవచ్చు. సమాజం లోని వ్యక్తి మతానికి అతీతంగా వెళ్లి తన స్వరూపాన్ని తెలుసుకోవాలని చెప్పే ఒకే ఒక మతం హిందూ మతం. జీవుడే భగవంతుడు అన్న విషయాన్ని తెలుసుకొని అలా వ్యవహరించమని చెప్పే మతం. ఇందులో చెప్పబడిన దేవుడు కూడా ఎవరి పట్ల ద్వేషం లేని వ్యక్తి. నన్నే పూజించు అని ఏ దేవుడు చెప్పడు. నన్ను కాక ఎవరిని పూజించిన నన్ను పూజించినట్లే అని కూడా భగవద్గీతలో శ్రీకృష్ణుడు అంటాడు. మత దురహంకారం లేని ఒకే ఒక మతం హిందూ మతం. వందలాది సంప్రదాయాలు ఉన్నప్పటికీ వాటన్నింటినీ కలిపి ఉంచిన ఉపనిషత్తుల సిద్ధాంతం ప్రపంచానికి ఆదర్శప్రాయమైంది. ఎదుటివాడిని తమ మతంలోకి మార్చాలి అనే ప్రస్తావన ఇందులో లేదు. ప్రపంచ శాంతికి ఒకే ఒక మార్గం సనాతన ధర్మం. సనాతన ధర్మం అంటేనే కులం అని అసహ్యించుకునే వాళ్ళు ఉంటారు. కానీ హిందూ మతం కులాన్ని సృష్టించలేదన్న విషయం మన పుస్తకాలను చదివితేనే తెలుస్తుంది. హిందూ మతం కుల వ్యవస్థను సృష్టించినట్లు ఏ పుస్తకంలోనూ చూడలేము. సమాజం అవసరాలను బట్టి కులాలు ఏర్పడ్డాయి గాని ఏ దేవుడు గాని, ఏ రుషి గాని కులాన్ని సృష్టించలేదు- అని సవాలు చేసి ఈ విషయంపై నా ఇటీవలి పుస్తకంలో చర్చించడం జరిగింది. సనాతన ధర్మం పరిధి చాలా విస్తారమైనది. వైదిక సంస్కృతితో మొదలైన ఈ ధర్మానికి బౌద్ధం, జైన మతం సిక్కు మతం కాల క్రమంలో కొత్త శాఖలుగా వచ్చాయి. వీటన్నింటిని ప్రస్తుతం భిన్న మతాలుగా మనం చెపుతున్నప్పటికీ మన సంప్రదాయం ప్రకారం వీటన్నిటిని వివిధ దర్శనాలుగానే పేర్కొన్నారు. వీటన్నింటిలో సిద్ధాంత విషయంలో భేదం కొంత ఉన్నప్పటికీ ధర్మం విషయంలో తేడా లేదు. సనాతన ధర్మం రక్షణ బోర్డ్ పరిధిలోకి హిందూ మతం మాత్రమే కాక బౌద్ధం, జైన మతం, సిక్కు మతాలను కూడా చేర్చవచ్చు. హిందూమతంలోనే వందలకొద్దీ సంప్రదాయాలు మరి వీరందరూ ఈ బోర్డు పరిధిలోకి రావడానికి అంగీకరిస్తారా అన్నది ఒక విషయం. తమ ఉనికిని కాపాడుకోవాలంటే అందరూ ఈ బోర్డు పరిధిలోకి రావడం ఒకటే మార్గం.

# గ్రామాల్లో మొదలైన బొడ్డెమ్మ ఆట



నల్లబెల్లి(గౌతమ్ న్యూస్): మండలంలోని అన్ని గ్రామాలలో తెలంగాణ జాతీయ పండుగ అయిన బతుకమ్మ పండుగలో భాగంగా మొదట ఏర్పాటు చేసుకునే బొడ్డెమ్మ పండుగ అట్టహాసంగా ప్రారంభమైంది గ్రామాలలోని మహిళలు పుట్టమొట్టితో బొడ్డెమ్మను ఐదు తంతేలుగా విగ్రహం రూపంలో తయారుచేసి దానిపై గౌరమ్మ కళాశాన్ని ఏర్పాటు చేసుకొని తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే పాటలను కొనసాగిస్తూ కోలాటాలు చేతిగంట కోలాటాలు నిర్వహించి మహిళలు భక్తిశ్రద్ధలతో ఈ బొడ్డెమ్మ ఆటను నిర్వహించారు ఈ బొడ్డెమ్మ ఆట 9 రోజులు కొనసాగుతుందని 9వ రోజు రాత్రి బొడ్డెమ్మ ను సమీప చెరువులో నిమర్జనం చేసి మరుసటి రోజు నుంచి బతుకమ్మ పండుగ పిత్ర అమావాస్య పేరుతో ప్రారంభం అవుతుందని మహిళలు పేర్కొన్నారు మొత్తంగా మండలంలోని అన్ని గ్రామాల్లో బొడ్డెమ్మ ఆటతో పండుగ వాతావరణం ప్రారంభమైంది.

# ప్రెస్ క్లబ్ అధ్యక్షులును ఘనంగా సన్మానించిన

### రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు! - మైనంపల్లి హనుమంతరావు!!



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా షేక్ అబ్దుల్ అజీజ్ ఎన్నికైన సందర్భంగా మెదక్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మైనంపల్లి హనుమంతరావు శాలువలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మాజీఎమ్మెల్యే మదన్ రెడ్డి ,తూముకుంట నర్సారెడ్డి, నర్సాపూర్ తాలూకా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే సుదర్శన్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్, ఎస్ రవీందర్ రెడ్డి ,చింతల కర్ణాకర్ రెడ్డి, గోమర మాజీ సర్పంచ్ పి లావణ్య మాధవరెడ్డి ,మాజీ ఎంపీటీసీ నరసింహారెడ్డి ,చెరుకుపల్లి నర్సింహారెడ్డి ,పి బుచ్చిరెడ్డి ,పి వెంకటరెడ్డి ,కొడకంచి శ్రీనివాస్ గౌడ్, బండారు గంగాధర్ ,కాముని శ్రీనివాస్ ,బాలకృష్ణ , హనుమంత్, రెడ్డి ,తలారి శివులు ,నర్సింగ్ ,రమేష్ ,ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాపతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### శివంపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ను ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానింన

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



నర్సాపూర్(గౌతమ్ న్యూస్): మెదక్ జిల్లా నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి శివంపేట మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా అబ్దుల్ అజీజు ఏకగ్రీవంగా సందర్భంగా శివంపేట మండలంలోని గోమారం గ్రామంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి స్వగృహంలో శివంపేట మండలం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా షేక్ అబ్దుల్ అజీజ్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించిన వారిలో జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండి మన్సూర్ జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్ మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షులు వాకిటి హనుమంత రెడ్డి మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు కే యాద గౌడ్ మర్రి మహేందర్ రెడ్డి మోహన్ రెడ్డి శ్రీశైలం యాదవ్ వాకిటి బిక్షపతి రెడ్డి వాకిటి శశిధర్ రెడ్డి వాకిటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్ట్ సంఘాల నాయకులు వి గోవింద్ చారి షబీర్ ఆర్ నాగేష్ ఖదీర్ పద్మాచారి బాలు నాయక్ శ్రీకాంత్ ప్రజాపతి నిధులు నాయకులు తదితరులు ఉన్నారు

# కేజీకేఎస్ జిల్లా అధ్యక్షుని పరామర్శించిన కేజీకేఎస్రాష్ట్ర అధ్యక్షులు, గోపా డివిజన్ అధ్యక్షులు



మానుకోట జిల్లా(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యమగాని వెంకన్న గౌడ్ తండ్రి యమగాని జానయ్య ఇటీవల హఠాన్మరణం చెందగా జానయ్య దశదిన కర్మకు కేజీ కేఎస్ అధ్యక్షులు ఎంవీ రమణ, సిపిఎం నాయకులు సాధుల శ్రీనివాస్, గోపా డివిజన్ అధ్యక్షులు, చిలువేరు సమ్మయ్య గౌడ్ హాజరై వారి కుటుంబాన్ని పరామర్శించి, జానయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆ దేవుని సన్నిధిలో జానయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గుణ గంటి మోహన్, గౌని వెంకన్న, చిత్తలూరి శ్రీనివాస్, మోడం వెంకటేశ్వర్లు, నరేటి కొమురయ్య, రేసు వెంకటేశ్వర్లు, నరేటి సత్యం, పానుగంటి ప్రభాకర్, నరేటి సత్యం, సురేందర్ గౌడ్, గండి వీరేందర్ గౌడ్ మరియు జిల్లా, మండల వివిధ సంఘ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు మంత్రి పదవులు ఇస్తే బీఆర్ఎస్ ఖాళీ!!!!

### రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): నర్సాపూర్ పట్టణంలోని ఆవుల రాజిరెడ్డి గారి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు,పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి . ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్లో ఉన్నారని, రెండు మంత్రి పదవులు ఇస్తే బీఆర్ఎస్ పార్టీ మొత్తం ఖాళీ అవుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమతో పెట్టుకోవద్దని.. పెట్టుకుంటే మీ గోతి మీరు తవ్వుకుంట్లే అని హరీష్ రావు, మాజీ మంత్రి కేటీఆర్ పై మైనంపల్లిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ , సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సారెడ్డి ,దుబ్బాక ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఇన్చార్జి పూజల హరికృష్ణ, సుహాసిని రెడ్డి ,రవీందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు..

# టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0

# పొగాకు వాడడం ద్వారా వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సు



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య అధికారి ఆ దేశానుసారంగా మంగళవారం సులా నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో సులానగర్ లో ప్రజలకు మరియు వైద్య సిబ్బందికి అవగాహన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా వైద్యాధికారి



మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం 10 లక్షల పైగా మరణాలు కేవలం పొగాకు సంబంధించిన ఉత్పత్తులు యువత తీసుకోవడం వలన జరుగుతున్నాయని పొగాకు పీల్చడం ద్వారా అతనితో పాటు అతని కుటుంబంలోని పిల్లలు వృద్దులు ఇతర సభ్యులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని, పొగాకులో ఉండే నికోటిన్ వల్ల రక్తనాళాల సంకోచ వ్యాకోచాలు తగ్గి తీవ్రమైన



గుండె సమస్యలు హైబీపీ గుండెపోటు బారిన పడడం, ఊపిరితిత్తుల వ్యాధులు అయిన దగ్గు ఆయాసం క్యాన్సర్ క్షయ వ్యాధి బారిన పడటం, యువతలో సంతానలేమి సమస్యలు, ఎముకలు గుల్లబారి అరిగిపోవడం విరిగిపోవడం, నరాల బలహీనత, దంతాలు మరియు చిగుర్ల సమస్యలు నోటిలో మరియు ప్రేగులో ఉండే సున్నితమైన మ్యూకస్ పొర దెబ్బ తినడం వల్ల నోటి క్యాన్సర్ తదితర సమస్యల బారిన పడుతున్నారని, ఆరోగ్యపరంగా మరియు ఆర్థికంగా నష్టపోయి కుటుంబాలు వీధిపాలు కాకుండా ఉండాలంటే పొగాకు ఉత్పత్తులు అన్నిటికి దూరంగా ఉండాలని పొగాకు సేవించడం వల్ల వచ్చే అన్ని రకాల అనర్థాలను విద్యార్థులకు యువతకు సవివరంగా వివరించి పొగాకు వాడకాన్ని సమాజం నుండి సమూలంగా నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని వారన్నారు .ఈ కార్యక్రమంలో సిడిపిఓ మంగతార , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ, సూపర్వైజర్లు పోర్న శ్రీనివాస్, నాగు బండి వెంకటేశ్వర్లు, కౌసల్య సింగ్, అంగన్వాడీ సూపర్వైజర్లు అనురాధ, నిర్మల, లక్ష్మీ, యశోద, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు నేనున్నానని భరోసా కల్పించిన

### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు!

### మైనంపల్లి హనుమంతరావు!!





నర్సాపూర్ (గౌతమ్ న్యూస్): శివంపేట మండల కేంద్రంలోని గోమారంలో జరిగిన సంఘటన పై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. మంగళవారం నాడు మాజి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు శివంపేటలోవిలేకరుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి బిఆరెస్ పార్టీ పది సంవత్సరాలలో చేసిన అరాచకాలపై పోరాటం చేసి బిఆర్ఎస్ పార్టీని బొంద పెట్టడని చమత్కరించారు. రాష్ట్ర నలుమూలల తిరిగి బిఆర్ఎస్ పార్టీని కోలుకోలేని పరిస్థితికి తీసుకొచ్చాడని మైనంపల్లి హనుమంతరావు మండిపడ్డారు.గత రెండు రోజుల క్రితం శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో జరిగిన వినాయక నిమజ్జనంలో ఎలాంటి గొడవ జరగలేదని, ఇరు పార్టీల నాయకులు కార్యకర్తల మధ్య తోపులాట మాత్రమే జరిగిందని ఆయన అన్నారు. ఈ చిన్న విషయాన్ని కొన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన మీడియా భూతద్దంలో పెట్టి చూపిచ్చిందని ఆయన పేర్కొన్నారు. అలాంటి యూట్యూబ్ ఛానల్స్ కి, రాజకీయ పార్టీల తొత్తు చానల్స్ కి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఇకపోతే సిద్దిపేటలో హరీష్ రావు, సిరిసిల్లలో కేటీఆర్ బావ బామ్మర్దులు జాగ్రత్త ఉండాలని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి పైన లేని పోని ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తిరగబడితే బావ బామ్మర్ది బజార్లలో తిరగలేరని ఆయన హెచ్చరించారు. నిన్న హైదరాబాదులో హరీష్ రావు మాట్లాడిన సందర్భంలో వల్గర్ లాంగ్వేజ్ మాట్లాడారని అలాంటి మాటలు మాట్లాడడం రాజకీయ నాయకులకు శ్రేయస్కరం కాదని ఆయన హిత బోధ చేశారు. గోమారంలో జరిగిన చిన్న విషయాన్ని రాష్ట్ర మొత్తం మారు మోగే విధంగా మీడియా టిఆర్ఎస్ పార్టీకి సహకరించిందని పరోక్షంగా అన్నారు. నమస్తే తెలంగాణ పేపర్ ఫ్రంట్ పేజీలో చాట భారతం రాసిందని అదొక సమస్యనా అని ఆయన ప్రశ్నించారు. ప్రతి చిన్న విషయాన్ని భూతద్దంలో పెట్టి పెద్ద సమస్యగా చేయాలని చూస్తున్నారని విమర్శించించారు. హరీష్ రావు కి చెప్తున్నా అరేయ్ హరీష్ రావు చిన్న విషయానికి గోమారం కి వచ్చే అవసరమా అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. మాధవరెడ్డి ఎవరయ్యా నీ పార్టీలో పనిచేసి నిన్నటిదాకా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా చేశాడు కదా, సుధీర్ రెడ్డి ఏమో బిఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షునిగా పనిచేశాడు కదా వీరిద్దరు పార్టీ మారగానే గూండాలు గా అయిపోయారా ఏం మాట్లాడుతున్నావ్ అని ప్రశ్నించారు. నర్సాపూర్ ఏరియా ఫీస్ ఫుల్ గా ఉంది రాజకీయాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ సహకరించిందని అన్నారు. సిద్దిపేటలో గత 40 సంవత్సరాలుగా వారే పరిపాలిస్తున్నారని తాను సిద్దిపేట మీద దృష్టి పెట్టానని ఆయన అన్నారు. ఇలాగే కొనసాగితే బావా, బామ్మర్దుల ను టార్గెట్ చేయ వలసిందిగా కాంగ్రెస్ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పడవ మునిగిపోయే పరిస్థితి ఏర్పడిందని, ఇంకో ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తామంటే బిఆర్ఎస్ పార్టీ మొత్తం ఖాళీ అయిపోతుందని ఆయన చమత్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను స్టార్ట్ చేసినమా లేదా అని ప్రశ్నించారు. అందులో ఏదైనా సమస్య ఎదురైతే ప్రశ్నించేది మీరే కదా అని ఆయన అన్నారు. చిన్న మండలాలు ,చిన్న జిల్లాలు చేశారు ఎక్కడికి అక్కడ లీడర్లను అనుగదొక్కే ప్రయత్నం చేసింది మీరే కాదా అని ప్రశ్నించారు., ఖమ్మం లో ఉన్న లీడర్లు ఇద్దరు కష్టపడ్డారు రా బై నువ్వు ఖమ్మం పోయినప్పుడు రైస్ మిల్లర్ దగ్గర డబ్బులు వసూలు చేసి మీటింగ్ పెట్టిన పరిస్థితి మీది అని ఘాటుగా విమర్శించారు. ఖమ్మంలో మాట్లాడి కాంగ్రెస్ పార్టీలో ఇద్దరి పెత్తనం అంటావ్, అటు నల్గొండలో పోతే కోమటిరెడ్డి బ్రదర్స్ పెత్తనం సాగిస్తున్నారు అంటావు, అరే మీ కుటుంబమే కదరా బై నాయకులను చీల్చింది అని విమర్శించారు. దానం నాగేందర్ దీనికి ఉదాహరణ అని ఆయన అన్నారు. దానం నాగేందర్ తాను అన్నదమ్ముల్లాగా ఏ పార్టీలో ఉన్నా కలిసిమెలిసి పనిచేస్తాం కలిసే ఉంటాం, మదన్ రెడ్డి ని తండ్రి లాగా భావిస్తాం అని చెప్పారు. రాహుల్ గాంధీని ఒక వెధవ ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడుతున్నాడు వారి ఫ్యామిలీ చేసిన త్యాగం మరువ లేనిదని తెలియజేశారు. ప్రియాంక గాంధీ , సోనియాగాంధీ వారెప్పుడో ప్రధాని కావాలనుకుంటే అయ్యేవారని అలాంటి పదవులను తృణప్రాయంగా వదిలిపెట్టిన ఫ్యామిలీ అది అని ఆయన తెలిపారు. ఇప్పటికైనా లేనిపోని ఆరోపణలు చేయకుండా ప్రజా సమస్యల మీద కార్యక్రమాలు చేసుకోవాలని ఆయన హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, శివంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచిసుదర్శన్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ కుమార్ గుప్తా, గోమారం మాధవరెడ్డి, గోమారం సుధీర్ రెడ్డి,కొడకంచి శ్రీనివాస్ గౌడ్, బాసంపల్లి శ్రీనివాస్ గౌడ్, మరియు శివంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మేనేజ్మెంట్ ట్రైనింగ్ మైనింగ్ పోస్టుల విషయంలో జరిగిన అవకతవకలపై

# సింగరేణి చైర్మన్ కు వినతి పత్రం అందజేసిన

### తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర నేత కోట శివశంకర్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ లో మార్చి నెలలో ట్రైనీ మైనింగ్ గ్రాడ్యుయేట్ పోస్టులకు సింగరేణి యాజమాన్యం పరీక్ష నిర్వహించిన కంపెనీకి అంతర్గత లావాదేవీలు లాలూచీలు పడి ఒక్కొక్క పోస్టును 30 లక్షల కి అమ్ముకున్నట్టు వారికి కావలసిన అభ్యర్థులకు ముందే కీ పేపర్ వాళ్లకి చెప్పినట్టు మళ్లీ కీ పేపర్ లో ఏమైనా అబ్జెక్షన్స్ ఉంటే తెలియ చెప్పాలని అబ్జెక్షన్ తీసుకొని మళ్లీ అధికారుల కుమారులకు మార్కులు కలిపి మొత్తంగా సింగరేణి అధికారుల కుమారులకు ఉద్యోగాలు వచ్చే విధంగా అంతర్గత ఒప్పందాలు సింగరేణి లో కొంతమంది జిఎంలు చేసుకున్నారని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం దృష్టికి వచ్చిందని దీనిపై ఒక సమగ్రమైన విచారణ నిర్వహించాలని అసలు సింగరేణి సంస్థ అధికారుల పిల్లలు ఎవరెవరు సింగరేణిలో వివిధ పరీక్షలు రాశారు వాళ్ళ మార్కులు ఏంటి వాళ్ళ పరిస్థితి ఏంటి? ఎవరికీ డబ్బులు కట్టారు అనే విషయాలపైన సమగ్రమైన లోతైన విచారణ నిర్వహించాలని దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సిబిఐ ఎంక్వయిరీ వేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం డిమాండ్ చేస్తుంది కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇలా నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్న సింగరేణిలో కొంతమంది జిఎం లపై తెలంగాణ ప్రభుత్వం సింగరేణి చైర్మన్ బలరాం కఠినంగా వ్యవహరించాలి తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ కోరారు.

## లాభాల వాటా గ్రూప్ పెర్ఫార్మెన్స్ ఇన్సెంటివ్ లలో

# డిప్యూటేషన్ కార్మికులకు న్యాయం చేయండి

### సింగరేణి జిఎం షాలెం రాజు కు మెమొరాండం అందించిన ఏఐటీయూసీ నాయకులు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియా నుండి సుమారుగా 200 మంది కార్మికులు సత్తుపల్లి లోని సత్తుపల్లి లోని కిస్టారం మరియు జె వీ ఆర్ ఓ సీ లలో డెప్యూటేషన్ మీద పని చేస్తున్నారని వారికి లాభాల వాటా లో ఇచ్చే గ్రూప్ పెర్ఫార్మెన్స్ ఇన్సెంటివ్ లలో కొత్తగూడెం ఏరియా లోని మాతృ గనులలోని ఉత్పత్తి లెక్కగట్టి ఇవ్వడం వల్ల నష్టం జరుగుతుంది అని కాబట్టి వారు పని చేసే సత్తుపల్లి లోని ఓ సీ ల చోట నే వారికి లాభాల గ్రూప్ పెర్ఫార్మెన్స్ ఇన్సెంటివ్ లు ఇచ్చి న్యాయం చేయాలని కోరుతూ గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కొత్తగూడెం ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్ మరియు సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ లు జి ఏం షాలెం రాజు కు మెమొరాండం అందించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, ఆఫీస్ బేరర్ సందెబోయిన శ్రీనివాస్, వీ కే వర్క్ షాప్ పిట్ కార్యదర్శి మధు కృష్ణ, ఓ సి స్టోర్స్ పిట్ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్ సీ హెచ్ పీ అసిస్టెంట్ పిట్ కార్యదర్శి సురేందర్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ రాంబాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ సీఎం చంద్రబాబుపై కేటీఆర్ ప్రశంసలు..



**హైదరాబాద్, :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసలు కురిపించారు. పెన్షన్ పెంపుపై ఏపీ సీఎం మాట నిలబెట్టుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అయిన వారంలోనే ఏపీలో వృద్దులకు చంద్రబాబు పెన్షన్ పెంచారని అన్నారు. కానీ.. పెన్షన్ల పెంపుపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పారని కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో చిట్టినాయుడు సోదరుల కంపెనీ నడుస్తుందన్నారు. రైతు బంధు, భరోసా కాదు..సీఎం కుర్చీ కే భరోసా లేదన్నారు. హైదరాబాద్ లో మనం క్లీన్ స్వీప్ చేసిన్నామన్నారు. బీఆర్ఎస్ అన్ని సీట్లు గెలిచినామన్నారు. అందుకే రేవంత్ రెడ్డి నగర ప్రజల పై కక్ష కట్టారన్నారు. పేదల ఇండ్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. సెటిల్మెంట్ లు జరిగే మాదాపూర్ లోని తిరుపతి రెడ్డి ఇంటిని ఎందుకు కూల్చట్లేదన్నారు. తిరుపతి రెడ్డి కి ఒక న్యాయం.. పెదవాళ్ళకి ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. కోర్టులు పనిచేయని శనివారం ఆదివారం వచ్చి కూల్చుతున్నారని మండిపడ్డారు. హీరో నాగార్జున కన్వెన్షన్ కు కూల్చివేశారని గుర్తు చేశారు. దానికి అనుమతి ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ నే అన్నారు. అనుమతులు ఇచ్చిన అధికారులను ఎందుకు శిక్షించట్లేదు? అని ప్రశ్నించారు. పట్నం మహేందర్ రెడ్డి ఫామ్ హౌస్ ను ఎందుకు కూల్చట్లేదన్నారు. మంత్రుల ఫామ్ హౌస్ లు ఎందుకు ముట్టు కోవట్లేదని మండిపడ్డారు. నగరంలో మేము లక్ష ఇండ్లు కట్టినామని క్లారిటీ ఇచ్చారు. హైడ్రా కూల్చిన పేదలకు ఆ లక్ష డబుల్ బెడ్ రూముల్లో కేటాయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ములుగు మున్సిపాలిటీ బిల్లుపై గవర్నర్ జిష్ణు దేవ్ తో సీతక్క భేటీ



**హైదరాబాద్, :** తెలంగాణ మంత్రి సీతక్క ఈరోజు రాజ్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ పలు అంశాలపై చర్చించుకున్నారు. గవర్నర్‌తో భేటీ అనంతరం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. 2022లో ములుగును మున్సిపాలిటీగా మార్చే బిల్లును గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమోదించి గవర్నర్‌కు పంపింది. ములుగు మున్సిపాలిటీ వ్యవహారం రెండేళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఈ సందర్భంగా ములుగు మున్సిపాలిటీ బిల్లుతో పాటు మరో ఐదు బిల్లులకు ఆమోదం తెలపాలని గవర్నర్‌ను కోరాం. ఆదిలాబాద్ విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి తెలియజేశాం. ఆదిలాబాద్, నాగర్ కర్నూల్ చెంచు ప్రాంతాల్లో పర్యటించాలని గవర్నర్‌ను కోరాం. ములుగులోని ఓ గ్రామాన్ని దత్తత తీసుకునే ఆలోచనలో గవర్నర్ ఉన్నారు. దత్తత గ్రామాల జాబితాను గవర్నర్‌కు పంపామని, ఆదిలాబాద్ జిల్లా పర్యటనపై గవర్నర్ సానుకూలంగా స్పందించారన్నారు. ములుగు మున్సిపాలిటీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి వద్ద ఉన్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సీతక్క పేర్కొన్నారు.

## కమ్యూనిస్టులు.. భక్తులకు, దేవాలయాలకు వ్యతిరేకం కాదు.. లడ్డూ వ్యవహారం వీధుల్లోకి వద్దు..!



**అమరావతి,:** తిరుమల లడ్డూ వ్యవహారంపై రాజకీయ దుమారం రేగుతోన్న వేళ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ.. తిరుమల లడ్డూ వివాద ఘటనను సుప్రీంకోర్టు సుమోటో గా తీసుకుని విచారణ చేయాలని కోరారు.. ప్రజ సమస్యలు అన్ని పక్కనపెట్టి లడ్డూ సమస్య మొదటికి వచ్చిందన్న ఆయన.. కమ్యూనిస్టులు.. భక్తులకు, దేవాలయాలకు వ్యతిరేకం కాదు అని స్పష్టం చేశారు.. అయితే, భక్తుల మనోభావాలను దెబ్బకొట్టి విధంగా పరిస్థితిలు వచ్చాయి.. జగన్ రివర్స్ టెండర్లు పెట్టడం వల్ల తీవ్రమైన నష్టం కలిగింది.. అసలు ఎందుకు చెన్నై డైరీకి నెయ్యి కాంట్రాక్టు ఇచ్చారు.. తక్కువ రేటుకు నెయ్యి వస్తుందని.. లడ్డూలో ఎక్కడలేని దరిద్రాలు కలిపి తినమని చేబుతారా.. బుద్దిలేదా అని ఫైర్ అయ్యారు.. తిరుమల నెయ్యి టెండర్లను రివర్స్‌లో చేయడం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు నారాయణ.. దానివల్ల కల్తీ నెయ్యి జరిగిందని రిపోర్టు వచ్చింది.. నెయ్యి విషయంలో ఎలాంటి అలోచన లేకుండా వైసీపీ టెండర్లు ఇచ్చింది.. లోపం దొరికింది కాబట్టి చంద్రబాబు బయటపెట్టారని తెలిపారు.. జగన్ ఇసుక మాఫియాకు, ఎర్రచందనం మాఫియాకు బోర్డు సభ్యులుగా ఇచ్చాడు అని విమర్శించారు.. లడ్డూ నాణ్యత అనేది వైసీపీ ప్రభుత్వంలో లేదని.. వారం రోజుల ఉండే నాణ్యత ఒక్కరోజు కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు.. విచారణ కమిటీలో అన్ని తెలుతాయి ఇకపై వీధుల్లో లడ్డూ వ్యవహారాన్ని తీసుకుని రాకండి అని సూచించారు.. మరోవైపు.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. అసలు సనాతన ధర్మం అంటే ముందు పవన్ కల్యాణ్ పూర్తిగా చదువుకోవాలని సూచించారు.. ఇంకోవైపు.. మోడీ మన ప్రధాన మంత్రి కాదు.. ఎప్పుడు విదేశాల్లో ఉంటూ అప్పుడప్పుడు ఇండియాలో ఉంటాడని సెటైర్లు వేశారు.. ఇక, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కు మేం ఒప్పుకోం అని స్పష్టం చేశారు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ.

# దామగుండం అడవిని కాపాడుకుందాం!

దేశ రెండవ రాజధానిగా కీర్తించబడుతున్న హైదరాబాద్ ప్రజలు భుజాలకు ఆక్సిజన్ సిలిండర్లను తగిలించుకుని తిరగవలసిరావడం అనివార్యమేనా? రెండు దశాబ్దాల క్రితం వరకు మంచినీళ్లు బాటిళ్లలో కొనుక్కొని తాగుతామని అనుకున్నామా? కానీ నిజమైంది కదా . ఇప్పుడు మౌనం వహిస్తే మాత్రం త్వరలో ఆక్సిజన్ కోసం, సిలిండర్ గాలి పీల్చుకోవడమే. వేగంగా విస్తరిస్తున్న జంట నగరాల పరిస్థితి అలాగే ఉండబోతుంది. అభివృద్ధి పేరిట ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు, ఆధునీకరణలతో హైదరాబాద్ కాలుష్య కాసారం అవుతుంది. అడవుల ధ్వంసం, రింగ్ రోడ్లు, ఫిలింసిటీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ఇందులో భాగమే. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2030 నాటికి హైదరాబాద్ ప్రజలు పూర్తిగా మాస్కులతోనే తిరగ వలసి ఉంటుందన్నది నిష్టూర సత్యం.

### అడవులు కాంక్రీట్ జంగిల్స్ అయితే..

హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న దామగుండం రిజర్వ్ ఫారెస్ట్ 3000 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో 2900 ఎకరాల ఫారెస్ట్‌ను లోఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ఇండియన్ నేవీకి గత రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనిలో రాడార్ యాంటెన్నా పార్క్‌తో పాటు, టౌన్‌షిప్‌ని అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. ఇదే జరిగితే రియల్ ఎస్టేట్ రాబందులు వాలి మరింత ధ్వంసానికి పాల్పడతాయి. దీంతో దీనికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనంతగిరి హిల్స్ కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఇప్పుడు పర్యాటక కేంద్రంగా ఉన్న ఈ ప్రాంతం, త్వరలో కాంక్రీట్ జంగల్‌గా మారుతుంది. దీనివల్ల 20 గ్రామాలు, 60వేల అమాయక ప్రజల జీవితాలు అగమ్య గోచరమవుతాయి. దీనిపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉంది.

### 12 లక్షల చెట్లు... మన ఊపిరితిత్తులు

గతంలో తిరునల్వేలిలో నిర్మించిన కట్ట బొమ్మన్ రాడార్ స్టేషన్‌తో ప్రజలకు ఇబ్బంది కలగనందున ఎలాంటి వ్యతిరేకత రాలేదు. దీనికంటే 100 రేట్లు శక్తివంతమైన రాడార్ స్టేషన్‌ను ఇక్కడ నిర్మించాలనుకుంటున్నారు. జరగబోయే నష్టం ఏ స్థాయిలో ఉంటుందో ఊహించడం కష్టం. ఈ రిజర్వ్ ఫారెస్ట్ 12 లక్షల పచ్చని చెట్లతో విస్తరించి, రాష్ట్ర రాజధాని ప్రజానీకంతో పాటు, పరిసర జిల్లాలకు ఆక్సిజన్ అందిస్తున్నది. ఇంకొక రకంగా చెప్పాలంటే ఊపిరితిత్తులా ఉపయోగపడుతుంది. నిజానికి ఈ రిజర్వ్ ఫారెస్ట్ భూమి అటు ప్రభుత్వానికి కానీ, ఇటు అటవీ శాఖకు కానీ చెందినది కాదు. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయ భూములు. దీనిని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అన్యా క్రాంతం చేసి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడచూసిందని అందరికీ అర్థం అయింది.

### హైడ్రా అక్కడా కన్నేయాలి!

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం విపరీతంగా



పెరిగిపోయింది. దేశంలోని కాలుష్య నగరాలలో ఢిల్లీ ప్రథమ స్థానంలో ఉండగా, హైదరాబాద్ నాలుగో స్థానంలో ఉంది. డబ్లుహెచ్ఓ నివేదిక ప్రకారం గాలి కాలుష్యం రేటు 1.7 రేట్లు అధికంగా ఉంది. దీనివల్ల భూతాపం కూడా పెరిగింది. ప్రస్తుత ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళన కోసం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామంటుంది. చెరువుల దురాక్రమణకు వ్యతిరేకంగా హైడ్రాను తీసుకొచ్చింది. గత ప్రభుత్వం హరితహారం, వన మహోత్సవం నినాదాలతో హోరెత్తించింది. ఇలా ప్రభుత్వాలు పర్యావరణాన్ని కాపాడుతామంటూనే అడవుల ధ్వంసానికి అనుమతిస్తూ గత పాలకులు ద్వంద నీతి పాటిం చడం పరమ అభ్యంతరకరం. రామోజీ ఫిలింసిటీకి వందల ఎకరాల రాచకొండ అటవీ భూములను కట్టబెట్టి నాశనం చేయ చూశారు. ఫార్మాసిటీ పేరిట వందలాది ఎకరాల భూములు కాలుష్యం కానున్నాయి. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల భూమిని హైకోర్టు కొత్త భవనానికి కేటాయించి శంకుస్థాపన చేశారు. పట్టణీకరణ కారణంగా, రియల్ ఎస్టేట్ వ్యాపారుల దాహార్తికి ఇప్పటికే వేలాది ఎకరాలు సిమెంట్ కమ్యూనిటీలుగా మారాయి. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు కూడా ఈ ప్రమాదం బారిన పడతాయి. ఈ కారణంగా నిర్వాసితుల సమస్య కూడా తలెత్తుతుంది.

### నదుల అంతర్ధానం తప్పదు!

అటవీ భూముల ఆక్రమణలతో నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టులు, మైనింగ్, గుట్టల తవ్వకాల అనుమతులతో పర్యావరణ కాలుష్యం, వలన ఏర్పడిన నిర్వాసిత్వ సమస్యలు పరిష్కారం కావడం లేదు. దామగుండం రిజర్వ్ ఫారెస్టును రాడార్ స్టేషన్‌కు అప్పగిస్తే మూసీ నది జన్మస్థలం అంతర్ధానం అయ్యే ప్రమాదం ఉంది. చత్తీస్‌గఢ్ అడవిలో అదానీ ప్రాజెక్టు పూర్తయితే, హస్దియో నది కనుమరుగవుతుంది. పోలవరం, కాళే శ్వరం ప్రాజెక్టుల నిర్మాణంతో లక్షలాది ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. శబరి నది ఉనికిలో లేకుండా పోతుంది. ప్రజలు ఈ విధ్వంసానికి వ్యతిరేకంగా శతాబ్దాలుగా పోరాడుతూనే ఉన్నారు. పర్యావరణ హిత ప్రాజెక్టులకు మాత్రమే అనుమతిచ్చేలా తెలంగాణ ప్రభుత్వం జాగ్రత్తగా అడుగులేయాలి.

### చిప్కో ఉద్యమం స్ఫూర్తిగా...

పాలకుల అనాలోచిత నిర్ణయాలు కార్పొరేట్ శక్తులకు సంపదను చేకూరుస్తున్నాయి. ప్రజల జీవితాలను ఆగం చేస్తున్నాయి. ఇప్పుడైనా పర్యావరణవేత్తలు, బుద్ధి జీవులు, న్యాయవాదులు, విద్యార్థులు, ప్రజా సంఘాలు, పౌర ప్రజాస్వామిక వాదులు కలిసికట్టుగా ఉద్యమిస్తే తప్ప ఈ విధ్వంసాన్ని అడ్డుకోవడం సాధ్యపడదు. ఈ విధ్వంసక అభివృద్ధికి వ్యతిరేకంగా నోరు విప్పకపోతే భవిష్యత్ తరాలు తీవ్ర ప్రమాదంలో పడడం ఖాయం. కనీసం తరాల మనుగడ కోసమైనా పోరాటాలకు నడుం కట్టి ముందుకు కదలడం అనివార్యం. కేవలం 300 చెట్ల పరిరక్షణ కోసం జరిగిన చిప్కో ఉద్యమాన్ని గుర్తు చేసుకోవడం, స్ఫూర్తి పొందడం ఈ సందర్భంలో ఎంతైనా అవసరం. రాజకీయాలకతీతంగా పాలకులను ఎక్కడికక్కడ నిలదీసి ప్రశ్నించే చైతన్యం కొరవడితే భవిష్యత్తు అంధకారం అవుతుంది. ప్రజలారా! పారాహుషార్!!

# ఈ రాష్ట్రాల్లో విజయావకాశాలు ఎవరివి

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యంగా ఢిల్లీ, హరియాణాలలో గెలుపు ఎవరిని వరించబోతుంది అనే అంశంపై ఓటర్లలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. అక్కడ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ జరగనుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఢిల్లీలో సీఎం పదవికి రాజీనామా చేసిన క్రేజీవాల్ ప్రభావం రాబోయే ఎన్నికల్లో ఉండే అవకాశం లేదని, కాంగ్రెస్, బీజేపీ వర్గాలు బలంగా భావిస్తున్నాయి. అయితే, అధికార మార్పిడి అనేది ఆప్ అంతర్గత వ్యవహారమేననీ, అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ రాజీనామా ప్రభావం ఉండదనీ, సానుభూతి ఓట్లుపడే అవకాశం లేదని అవి భావిస్తున్నాయి. సుదీర్ఘమైన ఆప్ పాలన తర్వాత పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని కనుక చాలా మంది నాయకులు, మంత్రులు ఆప్‌ను వదిలి కాంగ్రెస్‌లో చేరిపోతున్నారని అందువల్ల ఈ సారి కాంగ్రెస్ గెలుపు ఖాయం అని, ఢిల్లీ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు దేవేంద్ర యాదవ్ గట్టి ధీమా వ్యక్తం చేస్తున్నారు. అరెస్ట్ అయిన వెంటనే నైతిక బాధ్యత వహించి కేజ్రీవాల్ రాజీనామా చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని. బహుశా ఆప్ పార్టీపై సానుభూతి పనిచేసేదని తనతో పాటు విమర్శకుల వ్యాఖ్య. ఈ నేపథ్యంలో మొన్న లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌తో కలసి పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఒంటరిగా పోటీ చేయనుంది.

### ఆయన చేసిన అభివృద్ధే తిరిగి..

అయితే, ఇప్పటికీ కేజ్రీవాల్ సమర్ధ నాయకత్వం మీద ఢిల్లీ ప్రజలలో విశ్వాసం తగ్గిన సూచనలు ఏమీ కనపడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా లిక్కర్ స్కాంలో కేజ్రీవాల్‌ను, ఆయన మంత్రి వర్గ సహచర మంత్రులను ఇరికించి జైల్లో వేసిందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. ఇటీవల, ఆయన సహచర మంత్రులు జైలు నుంచి విడుదల కాగానే ప్రజలు... జేజేలు పలుకుతూ ఇచ్చిన స్వాగత సత్కారాలు ఇందుకు నిదర్శనం. ఇప్పుడు కేజ్రీవాల్ విడుదల సందర్భంగా ప్రజలు ఊరేగింపుగా పలికిన స్వాగత నీరాజనం అపూర్వం. ఆయన పాలనా కాలంలో చేసిన అభివృద్దే తిరిగి ఆప్‌కు పట్టం కట్టే అవకాశం ఉంది. పార్టీలో ఆయన మాటకు తిరుగులేదు. అసమ్మతి ఊసులేదు. అందుకే ఆయన ప్రతిపాదించిన అతిశీని సీఎంగా అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

### హరియాణాలో భిన్నమైన వ్యూహాలు..

ఈసారి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సభ్యుల్లో కీచులాటలు జరగకుండా కాంగ్రెస్ అధిష్టానం వ్యూహాత్మకంగా





వ్యవహరించింది. రాజకీయ ఎత్తుగడలో భాగంగా ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో కాంగ్రెస్ పార్టీ ముందుగా ప్రకటించలేదు. ఎన్నికల అనంతరం మెజార్టీ శాసనసభ సభ్యుల నిర్ణయం మేరకు ముఖ్యమంత్రి ఎంపిక జరుగుతుందని అధిష్టానం ముందుగానే తేల్చి చెప్పింది. నిజానికి ఈ సంప్రదాయం కాంగ్రెస్ సహజ స్వభావానికి వ్యతిరేకం. ఇంతవరకు దేశంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తమ ముఖ్యమంత్రిని ఎన్నికైన మెజార్టీ శాసనసభ సభ్యుల అభీష్టం మేరకు ముఖ్యమంత్రిని నిర్ణయించిన ప్రజాస్వామిక స్వభావం ఎన్నడూ కనబర్చలేదు. ప్రతిసారీ ముఖ్యమంత్రి ఎవరు ఉండాలో, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎవరు ఉండాలో నిర్ణయించేది కాంగ్రెస్ అధిష్టాన వర్గమే. కాంగ్రెస్‌లో పార్టీ సభ్యుల అభిప్రాయ సేకరణ అనేది ఒక తంతు మాత్రమే. చివరకు అధిష్టాన వర్గం ఒక చిట్టీ పంపుతుంది. దానిలో ఎవరి పేరు ప్రతిపాదిస్తే వారే ముఖ్యమంతి అవుతారు. ఇప్పుడు హరియాణాలో టిక్కెట్ల కేటాయింపుల్లో తమకు కీలక షేర్ ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడాతో పాటు... కేంద్ర మాజీ మంత్రి కుమారి సెల్జా, స్థానిక నేత రణదీప్ సుర్జేవాలా పట్టుపట్టారు. చర్చల అనంతరం మొత్తం రాష్ట్రంలోని 90 అసెంబ్లీ సీట్లలో అధిక వాటాను భూపేందర్ సింగ్ హుడా వర్గీయులకే కాంగ్రెస్ కట్టబెట్టింది. కేవలం 6 సీట్లలో మాత్రం అభ్యర్థులను ఏఐసీసీ సమిష్టిగా నిర్ణయించింది. అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ కలిసి మొత్తానికి వివాదరహితంగా సీట్ల కేటాయింపులు చేశారు.

### బీజేపీలో అంతర్గత పోరు..

అయితే, బీజేపీలో మాత్రం అంతర్గత కీచులాటలు జరిగాయని ఏఐసీసీ ప్రతినిధి మనోజ్ చౌహాన్ వ్యాఖ్యానించారు. కానీ బయటకు మాత్రం అలాంటి సూచనలు ఏమీ కనిపించడం లేదు. కాంగ్రెస్ తరపున హుడా వర్గానికి చెందిన మల్లయోధురాలు వినేష్ ఫోగాట్ ఎన్నికల బరిలోకి దిగారు. బీజేపీ ప్రభుత్వం పాలనలో రాష్ట్రాన్ని పదేళ్లు వెనక్కి నెట్టిందని, ఆ పార్టీని ఓడించడానికి పోరాడుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. టికెట్ల పంపిణీలో కాంగ్రెస్ పార్టీ జాగ్రత్తలు పాటించింది. జాట్‌లకు 35, ఓబీసీలకు 20, ఎస్సీలకు 17, ముస్లింలకు 6, బ్రాహ్మణులకు 4, వైశ్యులకు 2, పంజాబీలకు 6 స్థానాలు కేటాయించింది. ఈసారి ఎలాగైనా విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుంది. ఓటర్లు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

# ఏకస్వామ్యం వైపుగా జమిలి ఎన్నికలు..




'ఒకే దేశం ఒకే పన్ను' నినాదం తర్వాత, నేడు 'ఒకే దేశం ఒకే ఎన్నికలు' అనే యజ్ఞం కోసం కేంద్రం సిద్ధమైపోయినట్టుంది. గత సంవత్సరమే మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయడం, అది సిఫారసులు ఇవ్వడం, కేంద్ర మంత్రిత్వ శాఖ ఆమోదం తెలపడం, ప్రభుత్వం అందుకు అనుగుణంగా సన్నద్ధం కావడం జరిగిపోతోంది. ఈ సిఫారసుల ప్రకారం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం జరుగుతుంది. ఒకవేళ లోక్‌సభ ఎన్నికలకు ముందు ఏదైనా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం జరిగితే, వాటి కాలపరిమితి కూడా లోక్‌సభ ఎన్నికల వరకు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత, ఆ రాష్ట్రాలు మరలా లోక్‌సభతో కలిపి ఎన్నికల కోసం సిద్ధం కావాల్సి ఉంటుంది. ప్రభుత్వం వాదన ప్రకారం, జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుంది. ఆర్థికాభివృద్ధి జరుగుతుంది. ఎన్నికల నిర్వహణలో మరింత సౌలభ్యం ఏర్పడుతుంది. ఎన్నికల కోడ్ మాటిమాటికి లేకపోవడం కారణంగా వివిధ సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు తొలగుతాయి. కాబట్టి పరిపాలనలో అడ్డంకులు లేకుండా సున్నితంగా ముందుకు నడుస్తుంది. ప్రతిపక్షం ప్రకారం, భారతదేశం ఫెడరల్ రాజ్యాంగం స్వభావంతో ఉంది. కేంద్రం హక్కులు కేంద్రానికి ఉన్నాయి. రాష్ట్రాల హక్కులు రాష్ట్రాలకు ఉన్నాయి. ఒకే దేశం ఒకే ఎన్నికలు అనే నినాదం కింద రాష్ట్రాలు తమకంటూ ఒక ఉనికిని కోల్పోతాయి.

అవిశ్వాస తీర్మానాలు పనిచేయవ్!

ఈ కొత్త విధానం ఎన్నో కొత్త సమస్యలను సృష్టి స్తుంది. లోక్‌సభలో ఏదైనా ఒక ప్రభుత్వం ఏర్పడినప్పుడు, ఆ ప్రభుత్వం సక్రమంగా పనిచేయకపోతే, ఆ ప్రభుత్వం మీద అవిశ్వాసం ఏర్పడినప్పుడు, ఆ ప్రభుత్వం పడిపోయి మరలా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంటుంది. కానీ, జమిలి ఎన్నికల ప్రకారం, ఈ అవకాశం ప్రజలకూ, ప్రజాప్రతినిధులకూ దొరక్కుండా పోతుంది. అంటే, ఒకసారి మనం ఎన్నుకుంటే, ఆయా ప్రభుత్వాలు ఎలా పరిపాలన చేసినా సరే, అవిశ్వాస తీర్మానం అనేది అసాధ్యం అయ్యేలా వాస్తవ పరిస్థితి ఉంటుంది. ఒకవేళ, కేంద్ర ప్రభుత్వం పడిపోయే పరిస్థితి వచ్చేటప్పుడు, రాష్ట్రాల అసెంబ్లీల పరిస్థితి ఏమవుతుంది? ఇదే పరిస్థితి రాష్ట్రాలలో కూడా రావచ్చు. అప్పుడు లోక్‌సభ గడువు వరకు ఆ రాష్ట్రాలు వేచి ఉండాలా? అంతవరకూ ఆయా రాష్ట్రాల్లో ప్రెసిడెంట్ రూల్ విధిస్తారా? కనీస ప్రజాస్వామ్య హక్కులు ఇవ్వరా?

జమిలి... సమాఖ్యకు వ్యతిరేకం

నోట్ల రద్దు సమయంలో కూడా దేశానికి ఏదేదో మంచి జరిగిపోతుందనీ, ఇదో మహా యజ్ఞం అనీ నమ్మించారు. జీఎస్టీ సమయంలో కూడా ఇలానే నమ్మించారు. వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా మారాయి. ఖర్చు తగ్గుతుందనే సాకుతో దేశమంతా ఎన్నికలు ఒకేసారి నిర్వహించడం అనేది పార్లమెంటరీ రాజ్యాంగానికి, ఫెడరల్ విధానానికి విరుద్ధం. 2014 నుండి ఎన్నికలు మరింత ఈవెంట్ మేనేజ్మెంట్‌గా మారిపోయాయి. ఎన్నికలు ఒక భారీ వ్యాపారం అయ్యాయి. ఎలక్టోరల్ బాండ్ల కుంభ కోణం మనకు తెలిసిందే. వ్యాపారాలు నిశ్చయంగా ధనిక వర్గానికి మాత్రమే ప్రయోజనం ఇస్తాయి. అలానే, వ్యాపారంగా రూపొందిన ఎన్నికలు కూడా. ప్రజలకు ప్రజాస్వామ్యం అనే మాటలు చెబుతూ, ఒకవైపు కార్పొరేట్లు, మరోవైపు విపరీతంగా డబ్బు బలం ఉన్న ధనిక పార్టీలు కుమ్మక్కై మొత్తం ఎన్నికలని హైజాక్ చేసి దేశమంతా ఒకే పార్టీ ఉండేలా శాసించే పరిస్థితి రావచ్చు. ముఖ్యంగా 1990 తర్వాత ప్రారంభమైన ప్రపంచీకరణ ప్రజా ప్రయోజనాలను పక్కకు తోసి, పాలసీల్లో కార్పొరేట్ వర్గం ప్రయోజనాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2014 తర్వాత ఇది మరింత తీవ్రస్థాయికి చేరుకుంది. ప్రశాంత్ కిషోర్‌ల ప్రవేశంతో ఎన్నికల రూపురేఖలే మారిపోయాయి.

చిన్నపార్టీలు కుప్పగూలుతాయ్!

దేశంలోకి విపరీతంగా వచ్చి పడుతున్న పెట్టుబడులకు ఒక సానుకూలమైన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు కావాలి. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గానికి తమకు ఇబ్బంది కలగని, తమ పాలనా విధానాలకూ, తమ వ్యాపార ప్రయోజనాలకూ అడ్డంకులు లేని ఒక సున్నితమైన ఆర్థిక విధానం కావాలి. ఎన్నికలు దేశమంతా ఒకేసారి నిర్వహిస్తే ప్రయోజనం పొందేది. ఎన్నికల ఈవెంట్ మేనేజ్మెంట్ నిర్వహించగలిగే బీజేపీ లాంటి బలమైన పార్టీలే. చిరునామా కోల్పోయేది రాష్ట్రాలకు సంబంధించిన చిన్న పార్టీలే. ఎన్నికల మీద మరింత భారీగా పెట్టుబడులు చేరతాయి. కాబట్టి ఖర్చు తగ్గడం అనేది జరగదు. ఎన్నికల నిర్వహణ మరింత సులభం అవుతుందనే వాదన అర్థం లేని మాట. ఎన్నికలను నిర్వహించే ఎన్నికల కమిషన్ ఇలా ఎన్నికల నిర్వహణ కష్టం అవుతుందని ఏనాడైనా చెప్పినట్టు భారత పౌరులు విన్నట్టు లేదు. ఇంతవరకు ఎన్నికల నిర్వహణలో వైఫల్యాలను మనం చూడ లేదు. అలానే, సంక్షేమ పథకాలకు ఎన్నికల కార ణంగా ఆయా రాష్ట్రాల్లో ఇబ్బంది వచ్చినట్టు ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవు. ఒకవేళ అలాంటి సమస్యలు ఉంటే అవి ప్రభుత్వం వైఫల్యం అవు తుంది. కానీ, ఎన్నికలు అందుకు కారణం కావు.

ఏకస్వామ్యంలోకి ప్రజాస్వామ్యం!

ఈ ఎన్నికల ద్వారా ప్రజలకు సమయం ఆదా అవుతుందనేది మరో వాదన. రెండు సార్లు ఓటు వేసే ప్రజలు ఒకసారే ఓటు వేస్తారు అని. కానీ ప్రజలకు ఈ ఒక్క రోజూ ఆదా చేసేసినంత మాత్రాన వారికి ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదు. ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు దేశమంతా జరిగి, ఆ తర్వాత ఎలాంటి సమస్య వచ్చినా సరే మరలా ఐదు సంవత్సరాల వరకు ఎన్నికలు నిర్వహించని పరిస్థితి ఉన్నప్పుడు వినడానికి బాగానే ఉంటుంది. కానీ ప్రజాస్వామ్యం మెల్లమెల్లగా ఏకస్వామ్యంలోకి పయనిస్తుంది. లోక్‌సభకు అనుగుణంగా రాష్ట్రాలలోని శాసన సభలు తమకు తాము సర్దుకోవడం అలవాటు చేసుకుంటాయి. ఇలా సర్దుకోవడం పరోక్షంగా ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేసి కేంద్రాన్ని బలోపేతంగా మార్చుతుంది. అప్పుడు వీరు కలలుగనే హిందూ రాష్ట్రం ఇంకా ఎంతో దూరంలో ఉండదు. ఎన్నికలు మాటిమాటికీ నిర్వహించేటప్పుడు ఏదైనా పాలనాపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు వాటిని సులభతరం చేయడానికి మారుతున్న కాలంతో పాటు ఎన్నికల పద్ధతులు మరింత ఆధునీకీకరణం చేయడానికి ప్రయ త్నాలు జరగాలి. అంతేగాని మొత్తం ఎన్నికలన్నిటినీ ఒక దగ్గరే ప్యాకింగ్ చేసే పద్ధతులు ప్రజలకు ఏ విధమైన ప్రయోజనం అందించవు. ఏవైనా ప్రయోజనాలు అంది స్తే బలమైన పార్టీలకూ, స్వేచ్ఛా వాణిజ్యం చేస్తున్న కార్పొరేట్ వర్గానికి మాత్రమే. ప్రజలు కనీస హక్కులు కూడా కోల్పోయే పరిస్థితి ఎంతో దూరంలో లేదు.